మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి



3లో..

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 48 శనివారం 19 - 07 - 2025 పేజీలు: 8 వెల: 4

## 20కి పైగా స్కూళ్లకు బాంబు
# బెదిరింపులు

- పాఠశాల తరగతి గదుల్లో పేలుడు పరికరాలంటూ బెదిరింపు మెయిల్స్
- పేలుడు పదార్థాలను నల్లటి ప్లాస్టిక్ సంచులలో పెట్టినట్లు లేఖ
- ఢిల్లీలో బెదిరింపు మెయిల్స్ రావడం వారంలోనే ఇది మూడోసారి



మన గళం, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని 20కి పైగా పాఠశాలలకు ఢిల్లీలో ఈ రోజు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో ఆయా స్కూళ్ల వద్ద బాంబు స్క్వాడ్స్ తనిఖీలు నిర్వహిస్తున్నాయి. బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన స్కూళ్లలో సివిల్ లైన్స్‌లోని సెయింట్ గ్జావియర్స్, పశ్చిమ్ విహార్‌లోని రిచ్‌మండ్ గ్లోబల్ స్కూల్, రోహిణిలోని అభినవ్ పబ్లిక్ స్కూల్, ద సావిరిన్ స్కూల్ ఉన్నాయి. పోలీసుల కథనం ప్రకారం, బాంబు బెదిరింపు లేఖలో... "హలో. నేను పాఠశాల తరగతి గదుల్లో అనేక పేలుడు పరికరాలను (ట్రినిట్రోటోలుయెన్)

2లో..





## న్యూజిలాండ్ జనాభాకు మించి
# బిహార్‌కు ఇళ్లిచ్చాం

మన గళం, మోతిహారి: బిహార్ సర్వతోముఖాబివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మోతిహారిలో బుధవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడూతూ, ఈరోజు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తుడటం తనకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. న్యూజిలాండ్, సింగపూర్ దేశాల్లో ఉన్న జనాభాకు మించి బిహార్ ప్రజలకు ఇళ్లు ఇచ్చామని తెలిపారు. 'ఇది చంపారణ్ చారిత్రక గడ్డ. స్వాతంత్ర్య ఉద్యమంలో ఇక్కడి నుంచే గాంధీజీ ఒక కొత్త మార్గాన్ని నిర్దేశించారు. ఆ స్ఫూర్తితోనే ఇక్కడి నుంచి బిహార్‌కు సరికొత్త భవిష్యత్తును నిర్దేశించనున్నాం'

2 లో..

## గోల్డెన్ టెంపుల్ పేల్చివేస్తామని
# బెదిరింపు మెయిల్స్



మన గళం, అమృత్‌సర్: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న స్వర్ణ దేవాలయాన్ని పేల్చి వేస్తామంటూ వస్తున్న బెదిరిం పులకు చెందిన కేసులో పోలీ సులు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అరెస్టు చేశారు. బెదిరింపు ఈమెయిల్స్ చేసిన అనుమా నితుడిని శుభం దూబేగా గుర్తిం చారు. అతని స్వస్థలం ఫరిదా బాద్. పోలీసు కమీషనర్ గురుప్రీత్ సింగ్ బుల్లార్ దీనిపై ప్రకటన చేశారు. పాక్షికంగా సక్సెస్ సాధించినట్లు ఆయన చెప్పారు. ప్రశ్నించే నిమిత్తం అతన్ని కస్టడీలోకి తీసుకున్నట్లు కమీషన్ వెల్లడించారు. దూబేకు చెందిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. జూలై 14వ తేదీ నుంచి శిరోమని గురుద్వారా ప్రబందక్ కమిటీకి ఆరు సార్లు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. గోల్డెన్ టెంపుల్‌ను పేల్చివేస్తామని బెదిరించారు. ఈ నేపథ్యంలో పోలీసులు భద్రతను పెంచారు. ఈ కేసు విచారణ కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా భాగస్వామ్యమైనట్లు బుల్లార్ తెలిపారు. కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలతో అనుమానితుడికి లింకు ఉన్నట్లు తెలుస్తోంది.



## భానుపై చర్యలు
# తీసుకోండి: రోజా

- రూ. 2 వేలు ఇస్తే ఏమైనా చేసేదని భాను అన్నారన్న రోజా
- వ్యాంప్ కు ఎక్కువ అని నీచంగా మాట్లాడారని ఆవేదన

మన గళం, అమరావతి : నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ పై మాజీ మంత్రి రోజా జాతీయ మహిళా కమిషన్ కు, ఏపీ మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశారు. రూ. 2 వేలు ఇస్తే రోజా ఏ పనైనా చేసేదని... అలాంటి రోజా ఇప్పుడు రూ. 2 వేల కోట్లు సంపాదించిందని తన గురించి భాను ప్రకాశ్ చులకనగా

## ఇది 30 వేల ప్రాణాలు
# బలిగొన్న స్కామ్



మన గళం, అమరావతి : వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందని టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఇది కేవలం రూ. 3,200 కోట్ల స్కామ్ కాదని... 30 వేల మంది ప్రాణాలు

2 లో..

## రెండ్రోజుల్లో అమరావతి
# గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్





- అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్
- ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు
- గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం పెరిగిందని వెల్లడి
- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాలని పిలుపు

మన గళం, అమరావతి : హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్ ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. గ్రీన్ హైడ్రోజన్ పై పరిశోధనలు చేయాలని, ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అందుకు తగిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని సీఎం స్పష్టం చేశారు. శుక్రవారం నాడు అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ లో ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు ప్రసంగించారు. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా నూ తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి అన్నారు. రెండు రోజుల సదస్సు అనంతరం అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ ను ప్రకటిస్తామని, ఏడాది తర్వాత డిక్లరేషన్ అమలుపై సమీక్షిస్తామని సీఎం వెల్లడించారు. గ్రీన్ హైడ్రోజన్ ను తక్కువ వ్యయంతోనే ఉత్పత్తి చేసేలా కొత్త సాంకేతికను అభివృద్ధి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈమేరకు యూనివర్సిటీలు, పరిశోధకులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ అంశంపై సీఎం మాట్లాడుతూ... "గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం పెరిగింది. పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాలి. 2070 నాటికి కర్బన




## టీడీపీ పార్లమెంటరీ
# పార్టీ భేటీ..



మన గళం, అమరావతి : తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం ప్రారంభమైంది. ఈరోజు(శుక్రవారం) ముఖ్యమంత్రి

2లో..

## టీడీపీకి సీనియర్ నేత రాజీనామా..
### - భావోద్వేగానికి గురైన మాజీ మంత్రి



మన గళం, అమరావతి : గోవా గవర్నర్‌గా నియమితులైన టీడీపీ సీనియర్ నేత , కేంద్ర, రాష్ట్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పార్టీకి రాజీనామా చేశారు. విజయనగరం జిల్లా సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్న అనంతరం రాజీనామా పత్రాలపై సంతకాలు చేశారు . ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన పూసపాటి అశోక్ గజపతిరాజు తన రాజీనామా లేఖను టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు పంపించారు. టీడీపీ పార్టీ పొలిట్ బ్యూరోకు కూడా రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. పార్టీతో పాటు ప్రజలు, దేశానికి సేవ చేసేందుకు అవకాశం

2 లో..

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి
# అరెస్ట్‌కు రంగం సిద్ధం



మన గళం, అమరావతి : వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి సిట్ అధికారులు షాక్ ఇచ్చారు. ఆయనను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో వారెంట్ కోరుతూ విజయవాడ కోర్టులో పిటిషన్ వేశారు. మిథున్ రెడ్డి వైసీపీ ఎంపీ కావడంతో ఆయన తలదాచుకున్న ప్రాంతాల్లో సోదాలు, అరెస్ట్ చేసేందుకు చట్ట ప్రకారం ముందుకు వెళ్తున్నారు సిట్ అధికారులు. కాగా మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డి వేసిన ముందస్తు బెయిల్ పిటీషన్ ను హైకోర్టు డిస్మిస్ చేసిన సంగతి తెలిసిందే. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది . ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను ఏపీ హైకోర్టు డిస్మిస్ చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును

2లో..

# 20కి పైగా స్కూళ్లకు బాంబు బెదిరింపులు



ఉంచానని మీకు తెలియజేస్తున్నాను. పేలుడు పదార్థాలను నల్లటి ప్లాస్టిక్ సంచులలో చాలా జాగ్రత్తగా దాచిపెట్టాను. మీలో ప్రతి ఒక్కరినీ నేను ఈ ప్రపంచం నుంచి తుడిచివేస్తాను. ఒక్క ఆత్మ కూడా బ్రతకదు. నేను ఆ వార్తలను చూసినప్పుడు సంతోషంగా నవ్వుతాను. తల్లిదండ్రులు పాఠశాలకు రావడం.. వారి పిల్లల ఛిద్రమైన శరీరాలను చూసి ఏడవడం చూస్తాను. మీరందరూ బాధపడటానికి అర్హులు. నాకు నిజంగా నా జీవితం అసహ్యమే. తర్వాత నేను ఆత్మహత్య చేసుకుంటాను. నా గొంతు కోసుకుంటాను, నా మణికట్టును కోసుకుంటాను. నాకు నిజమైన సహాయం ఎప్పుడూ అందలేదు. మనోరోగ వైద్యులు, మనస్తత్వవేత్తలు ఇలా ఎవరూ పట్టించుకోలేదు. ఎవరూ పట్టించుకోరు కూడా. నిస్సహాయ మానవులకు మందులు ఇవ్వడం గురించి మాత్రమే మీరు శ్రద్ధ వహిస్తారు. ఆ మందులు మీ అవయవాలను నాశనం చేస్తాయని, బరువు పెరగడానికి కారణమవుతాయని మనోరోగ వైద్యులు మీకు ఎప్పుడూ చెప్పరు. మానసిక మందులు వారికి సహాయపడతాయని మీరు ప్రజలను ఆలోచించేలా చేస్తారు. కానీ వారు అలా చేయరు. వారు అలా చేయరనడానికి నేను ప్రత్యక్ష రుజువును. మీరందరూ దీనికి అర్హులు. మీరు నాలాగే బాధపడటానికి అర్హులు" అని లేఖలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, బుధవారం కూడా సుమారు ఏడు స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఢిల్లీలో బెదిరింపు మెయిల్స్ రావడం వారంలోనే ఇది మూడోసారి. మంగళవారం ఉదయం నార్త్ క్యాంపస్‌లో ఉన్న సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ, ద్వారకలోని సెయింట్ థామస్ స్కూల్‌కు బెదిరింపులు వచ్చాయి.

# న్యూజిలాండ్ జనాభాకు మించి బిహార్‌కు ఇళ్లిచ్చాం


అని మోదీ అన్నారు. ప్రపంచం వేగంగా 21వ శతాబ్దంలోకి దూసుకు వెళ్తోందని, ఒకప్పుడు అధికారం పాశ్చాత్య దేశాల చేతుల్లోనే ఉండేదని, ప్రస్తుతం తూర్పు దేశాల ఆధిపత్యం, పార్టిషిపేషన్ పెరిగిందని చెప్పారు. తూర్పు దేశాలు వేగవంతమైన అభివృద్ధిని అందిపుచ్చుకున్నాయని తెలిపారు. గ్లోబల్ డవలప్‌మెంట్‌లో తూర్పు దేశాలు ఏవిధంగా అడ్వాన్స్ అవుతున్నాయో, ఇండియాలోనూ తూర్పు రాష్ట్రాల శకం నడుస్తోందని అన్నారు.

**- 3.5 కోట్ల మందికి బ్యాంక్ అకౌంట్లు**


బీహార్‌లో 3.5 కోట్ల మందికి పైగా మహిళలకు బ్యాంకు అకౌంట్లు కల్పించామని, గత 1.5 ఏళ్లలో రాష్ట్రంలోని 24,000కు పైగా సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.1000 కోట్లు సాయం అందించామని చెప్పారు. ప్రస్తుతం 20కి పైగా లక్‌పతి దీదీలు బిహార్‌లో ఉన్నారని అన్నారు.రాబోయే రోజుల్లా పశ్చిమ భారతదేశంలో మోతిహారి పేరు మారుమోగుతుందని, గురుగ్రామ్ తరహాలోనే గయలోనూ అవకాశాల కల్పన జరుగుతుందని, పుణె తరహాలో పాట్నాలోనూ పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని ప్రధాని చెప్పారు. సూరత్ లాగానే సంథాల్ పరగణ కూడా అభివృద్ధి జరుగుతుందన్నారు. జైపూర్ తరహాలో జల్‌పాయ్‌గురిలో టూరిజం అభివృద్ధి జరుగుతుందని, బెంగళూరులా బీర్‌భూమ్ ప్రగతి సాధిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రధాని తన పర్యనలో భాగంగా బిహార్‌లో రూ,7,200 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. పలు రైలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. కాగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్-నవంబర్‌లో జరుగనున్నాయి. అయితే అధికారికంగా ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించాల్సి ఉంది. బీజేపీ, జేడీయూ, ఎల్‌జేపీ తిరిగి ఎన్డీయా కూటమిగా పోటీ చేస్తుండగా, ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు ఇండియా కూటమి భాగస్వాములుగా పోటీ చేస్తున్నయి, 243 మంది సభ్యుల అసెంబ్లీలో ప్రస్తుతం ఎన్డీయేకు 131 మంది సభ్యులున్నాయి. బీజేపీకి 80, జేడీయూకు 45, హెచ్ఏఎం(ఎస్)కు నలుగురు సభ్యులు ఉన్నాయి. 12 మంది ఇండిపెండెంట్లు మద్దతిస్తున్నారు. విపక్ష ఇండియా కూటమికి 111 మంది సభ్యులుండగా, ఆర్జేడీకి 77 మంది, కాంగ్రెస్‌కు 19, సీపీఐ (ఎంఎల్)కు 111, సీపీఎంకు ఇద్దరు, సీపీఐకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు.

# భానుపై చర్యలు తీసుకోండి: రోజా

మాట్లాడారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. తనను వ్యాంప్ కు ఎక్కువ... హీరోయిన్ కు తక్కువని నీచమైన వ్యాఖ్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మహిళ గురించి ఎవరైనా ఇంత నీచంగా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా మాట్లాడిన భాను ప్రకాశ్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలపై గొంతెత్తినందుకు గాలి భాను తనను దుర్భాషలాడుతూ బాధ పెట్టారని రోజా అన్నారు. ఇది కేవలం తనకు మాత్రమే జరిగిన అవమానం కాదని... అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించేందుకు ధైర్యం చేసిన ప్రతి మహిళపై జరిగిన దాడి అని చెప్పారు. ఇది ఒక ప్రమాదకరమైన సంస్కృతి అని అన్నారు.



# రెండ్రోజుల్లో అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్



రహిత ఇంధనాలు వాడాలన్నది మన జాతీయ లక్ష్యం. తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజ్‌పై దృష్టి సారించాలి. కేంద్రం కూడా గ్రీన్ హైడ్రోజన్ పరిశోధన, ఉత్పత్తికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకునేందుకు ఏపీ ఎప్పుడూ ముందు ఉంటుంది. ఇంధన ఖర్చు తగ్గాలి ప్రజలకు ప్రయోజనం చేకూరాలన్నదే ముఖ్యం. గ్రీన్ హైడ్రోజన్‌తో అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఇవ్వడం సాధ్యం. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంగా ప్రధాని నిర్ణయించారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంలో ఏపీ ప్రముఖ భాగస్వామిగా ఉంటుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇంధన రంగంలో ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలని పరిశోధకులకు సీఎం పిలుపునిచ్చారు. సంప్రదాయ ఇంధన వనరుల కారణంగా తీవ్రమైన కాలుష్యం బారిన పడుతున్నామని నెట్ జీరో కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారమని సీఎం అన్నారు.

ఇక సమీప భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్ దేనని.. ఇంధన రంగంలో అది గేమ్ ఛేంజర్ గా మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే తక్కువ ఖర్చుతో సామాన్యులు కూడా వ్యయం భరించేలా ఉండే దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఏపీలోనూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. విశాఖలో ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ హైడ్రోజన్ తయారు చేసేందుకు ప్లాంట్ ను ఏర్పాటు చేస్తోందని అన్నారు. అలాగే కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు.

**- గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సీఎం సమక్షంలో రూ.51 వేల కోట్లకు ఒప్పందాలు**

ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సదస్సు వేదికగా ట్రాన్స్‌ఫర్మేటివ్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం- ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రూపాయల్ని పెట్టుబడి పెట్టనుంది. అంతకుముందు, సదస్సులో భాగంగా ఇంధన రంగానికి చెందిన వివిధ సంస్థల సీఈఓలు, ఎండీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి భేటీ అయ్యారు. ఈ సదస్సుకు నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

# ఇది 30 వేల ప్రాణాలు బలిగొన్న స్కామ్

బలిగొన్న స్కామ్ అని చెప్పారు. ఈ స్కామ్ ను దేశ సరిహద్దులు దాటించిన వైసీపీ నేతలకు స్వర్ణ పతకాలు ఇవ్వాలని అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు, కాళేశ్వరం ప్రాజెక్టులపై ఈడీ విచారణ జరుగుతోందని... ఏపీలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్ పై కూడా ఈడీ విచారణ జరపాలని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. రూ. 50 కోట్లు పెట్టి కుక్క పిల్లను కొన్నానని ఒక వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు పెడితే... అది ఫేక్ అని కూడా తెలుసుకోకుండానే ఈడీ స్పందించిందని... ఏపీ లిక్కర్ స్కామ్ పై కూడా ఈడీ అదే విధంగా స్పందించాలని కోరారు. పహల్గామ్ టెర్రరిస్టులపై ప్రధాని మోదీ తీసుకున్న చర్యలు చూశామని... అదే విధంగా ఆర్థిక ఉగ్రవాదులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని చెప్పారు.

# టీడీపీ పార్లమెంటరీ పార్టీ భేటీ..

చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం మొదలైంది. ఈనెల 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏపీ ప్రయోజనాల కోసం అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల పరిష్కారం వంటి అంశాలపైనా చర్చించనున్నారు. తొమ్మిది ప్రధాన అంశాలు అజెండాగా పార్లమెంటరీ పార్టీ సమావేశం కొనసాగుతోంది. తొక్కిసలాటలు- గుంపుల నియంత్రణలో నిర్వహణ లోపాలు, వివిధ కేంద్ర పథకాల ద్వారా రుణాల మంజూరులో జాప్యం, మహిళా ప్రజాప్రతినిధులపై సోషల్ మీడియాలో అసభ్య ప్రచారం వంటి అంశాలపైనా చర్చించనున్నారు. రాష్ట్రానికి ఏరోస్పేష్ ఇండస్ట్రీ, స్పేస్ సిటీ, పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ఇబ్బందులు, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు, రాష్ట్రానికి విదేశీ పెట్టుబడుల అంశంపై పార్లమెంటరీ పార్టీ చర్చించనుంది. అమరావతి కేంద్రంగా క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు, అమరావతి అభివృద్ధికి కేంద్రం చర్యలు, మామిడి ధర తగ్గిపోవటం వల్ల రైతులకు నష్టంపై వంటి అంశాలు చర్చకు రానున్నాయి. పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పలువురు లోక్‌సభ, రాజసభ సభ్యులు హాజరయ్యారు.

# టీడీపీకి సీనియర్ నేత రాజీనామా..

కల్పించిన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ లేఖ కాపీని మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి పంపారు. తన రాజీనామాను ఆమోదించాలని లేఖల్లో అధిష్టానాన్ని కోరారు. ఇటీవల దేశంలో మూడు రాష్ట్రాలకు ముగ్గురు గవర్నర్ల నియామకంలో అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్ గా కేంద్రం నియమించింది. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీకి తప్పనిసరిగా రాజీనామా చేయాల్సి ఉండడంతో శుక్రవారం తన రాజీనామాను అధికారికంగా సమర్పించారు. 43 ఏళ్ల పాటు టీడీపీలోనే కొనసాగిన ఆయన 2004లో మినహా వరుసగా విజయనగరం ఎమ్మెల్యే, ఎంపీగా గెలుస్తూ వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా కొనసాగారు.

# వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్‌కు రంగం సిద్ధం

ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఈరోజు మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన సుప్రీం కోర్టు.. మిథున్ రెడ్డికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది. ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టేసింది. లిక్కర్ కేసులో తన ప్రమేయం లేకపోయినా.. రాజకీయ కక్షలో భాగంగా తనను అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని మిథున్ రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ జరిపిన జస్టిస్ జెబి పార్థివలా, జస్టిస్ మహదేవన్ ధర్మాసనం.. అరెస్ట్ చేయకుండా ఛార్జ్ షీట్ ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించింది. సరెండర్ కావడానికి వారం రోజులు గడువు ఇవ్వాలని మిథున్ రెడ్డి తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనాన్ని కోరగా.. దానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. తాజాగా సిట్ అధికారులు మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసేందుకు వారెంట్ కోరుతూ విజయవాడ కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. మిథున్ రెడ్డిని త్వరలోనే అరెస్ట్ చేస్తారంటూ చర్చ జోరందుకుంది. ప్రస్తుతం మిథున్ రెడ్డి పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

# అమరావతి ఓఆర్ఆర్ పనుల్లో వేగం

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి మణిహారంలా భావిస్తున్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణ పనుల్లో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ వేగవంతం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఓఆర్ఆర్ వెడల్పును 70 మీటర్ల నుంచి 140 మీటర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో, అందుకు అనుగుణంగా భూసేకరణ, నిధులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణకే దాదాపు రూ.5,000 కోట్లు, అటవీ భూముల కోసం మరో రూ.300 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్ఏఐ ప్రాథమికంగా అంచనా వేసింది. మొత్తం 189 కిలోమీటర్ల పొడవున నిర్మించే ఈ ఓఆర్ఆర్.. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లాల మీదుగా వెళ్లనుంది. దీనికోసం సుమారు 3,400 హెక్టార్ల ప్రభుత్వ, పట్టా, అసైన్డ్ భూములతో పాటు 250 హెక్టార్ల అటవీ భూములు అవసరమవుతాయని అధికారులు గుర్తించారు. గతంలో 70 మీటర్ల వెడల్పు ప్రతిపాదనతో పోలిస్తే భూమి అవసరాలు, బడ్జెట్ రెట్టింపు కావడం గమనార్హం. ఈ భారీ ప్రాజెక్టును 8 నుంచి 10 ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టాలని భావిస్తున్నారు. సగటున 25 కిలోమీటర్లకు ఒక ప్యాకేజీ చొప్పున పనులు కేటాయించనున్నారు. కృష్ణా నదిపై అమరావతికి సమీపంలో మున్నలూరు-ముత్తాయిపాలెం మధ్య ఒకటి, వల్లూరుపాలెం-వల్లభాపురం మధ్య మరొకటి చొప్పున రెండు భారీ వంతెనలను నిర్మించనున్నారు. ఈ వంతెనలను వేర్వేరు ప్యాకేజీలుగా చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్‌హెచ్ఏఐ అధికారులు సిద్ధం చేస్తున్న సమగ్ర నివేదికను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు పంపనున్నారు. అక్కడ వివిధ కమిటీల ఆమోదం తర్వాత కేంద్ర మంత్రివర్గం తుది అనుమతి ఇవ్వనుంది. అనంతరం భూసేకరణ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమవుతుంది. ఆరు జాతీయ రహదారులను అనుసంధానించే ఈ ఓఆర్ఆర్‌కు కొత్త జాతీయ రహదారి నంబర్‌ను కేటాయించాలని కూడా కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## లక్ష్మమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా మహిళా ఉద్యమ నేత టీసీ లక్ష్మమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని సీఐటీయూ, ఐద్వా సంఘం నాయకులు తెలిపారు. ఈరోజు 32 వార్డు ముజఫర్ నగర్ టిసీ లక్ష్మమ్మ కుట్టు శిక్షణ కేంద్రంలో టి సీ లక్ష్మమ్మ పదవ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్ సాయి బాబా, ఉపాధ్యక్షులు కె సుధాకరప్ప, మహిళా సంఘం కార్యదర్శి జె లక్ష్మి భాయి మాట్లాడారు. నిరంతరం మహిళా సమస్యల కోసం పోరాడిన నాయకురాలు టీసీ లక్ష్మమ్మ అని కొనియాడారు. ఉన్నతకుటుంబంలో జన్మించిన లక్ష్మమ్మ పేద మహిళల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారని గుర్తు చేశారు.ముజఫర్ నగర్లో సీపీఎంనాయకులు టి నరసింహయ్య పేరు మీద గ్రంథాలయం, లక్ష్మమ్మ పేరు మీద కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారని, మహిళలు యువకులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు యస్ ఓబులమ్మ, కె దానమ్మ, యస్ శారదమ్మ, ఈశ్వరమ్మ, సాలమ్మ, కె కుమారి, సుభద్రమ్మ, స్వామిదేవి, నీరజ ,పుష్ప, కీర్తన, ఆయిషా, ఆస్మా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి

- బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం వేగవంతం చేయండి
- నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి
- తల్లికి వందనం ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఈ నెల19న అధికారులు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం లక్ష్యంగా నిర్వహించాలని,అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర, పి 4 పాలసీ, తల్లికి వందనం, హౌసింగ్, ఉపాధి హామీ అమలు అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ వారం ప్లాస్టిక్ కాలుష్య నివారణ పై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యానికి సంబంధించి ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పి 4 కి సంబంధించి నిర్వహిస్తున్న గ్రామ సభల్లో బంగారు కుటుంబాల జాబితాను పరిశీలించి, అర్హులైన వారి తో తుది జాబితాను తయారు చేయాలన్నారు. జూలై 21 నుండి ఆగస్టు 5 వ తేది వరకు బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారి అవసరాలపై సర్వే నిర్వహించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..11706 ఇళ్ళ నిర్మాణాలు లక్ష్యంగా నిర్ణయించగా 7964 ఇళ్లు పూర్తయ్యాయని, 3742 ఇల్లు ఇంకా పూర్తి కావాల్సిందని కలెక్టర్ తెలిపారు. ఆప్షన్ త్రీ కింద ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారులకు జమ చేసిన డబ్బును ఇళ్లకు వాడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మిగనూరు మండలంలో 202 పెండింగ్ ఉన్నాయని, గత వారంలో ఒక్క ఇంటి నిర్మాణం మాత్రమే పూర్తి చేయడం ఏంటని కలెక్టర్ హౌసింగ్ ఏఈ పై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత ఏ ఈ కి షో కాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ హౌసింగ్ పిడిని ఆదేశించారు. తల్లికి వందనం ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఇప్పటివరకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడం జరిగిందన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు దినాలు పని కల్పించడం, సగటు వేతనాన్ని అందించడం అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, సీపీఓ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీఈఓ శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## ద్రోణాచలం సేవాసమితి ఆధ్వర్యంలో 116 వ అంత్యక్రియలు:



మన గళం, డోన్, : డోన్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో యాచించుకుంటూ తిరుగుతున్న ఒక వ్యక్తి చనిపోగా అక్కడున్న ఇరుగు పోరుగు వారు అతని అంత్యక్రియలు చేయండి అని ద్రోణాచలం సేవాసమితి వారికి కోరగా ఆ వ్యక్తి చనిపోయిన సమాచారాన్ని డోన్ టౌన్ సిఐ కి అందించి సిఐ ఆదేశాల మేరకు చనిపోయిన వ్యక్తి స్నానం చేయించి హిందూ సాంప్రదాయ పద్ధతిలో హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి అయిన ఖర్చు మొత్తం ప్రొద్దుటూరుకు చెందిన కీర్తిశేషులు వై.నారాయణరెడ్డి కుమారుడు చరణ్ తేజ రెడ్డి భరించారు వైకుంఠ రథాన్ని రోటరీ క్లబ్ రాజయ్య గౌడ్ ఉచితంగా సమకూర్చారు. ఈ పుణ్య కార్యక్రమములో ద్రోణాచలం సేవా సైనికులు షాదిఖాన రాజా, గురుస్వామి తాహెర్ బాష, బ్రహ్మయ్య మరియు టౌన్ పోలీసులు రామాంజనేయులు, ధనుంజయ లు పాల్గొన్నారు .

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీబీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ముందు 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరమ్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో నిరసన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెమో నెంబర్ 57 అమలు చేయాలని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టబద్ధత కల్పించాలన్నారు. డీఎస్సీ 2003 ద్వారా ఎంపికైన 9140 మంది ఉపాధ్యాయుల సమస్యను పరిశీలించి న్యాయం చేయాలన్నారు. 2003లో నోటిఫికేషన్ వేశారని, 2004లో రాత పరీక్ష ఫలితాలను వెల్లడించారని, 2005లో పోస్టింగులు ఇచ్చారని , ప్రభుత్వం చేసిన కాలయాపన వల్ల 18 నెలలు సర్వీసు కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా అతి ముఖ్యమైన పాత పెన్షన్ విధానాన్ని కోల్పోవడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం డీఎస్సీ 2003 అభ్యర్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు బాల తిమ్మారెడ్డి , షేక్ మెహారాజ్, జాన్సన్ , శాంతకుమారి, అలీ ఖాన్, వరలక్ష్మి, సుభాన్ , లక్ష్మి, నూర్ అహ్మద్, రాధ, మజార్, గీత, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను అప్పనంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టి లక్షల అవినీతి

- పాల్పడిన మండల సర్వేయర్ జగదీష్ ను సస్పెండ్ చేసి ఏసీబీ తో విచారణ జరిపించాలి :-సీపీఎం పార్టీ పట్టణ కర్యదర్శి నక్కి శ్రీకాంత్




మన గళం, డోన్ : ప్రభుత్వ భూములను నిజమైన రైతుల భూములను భూ బకాసులకు,రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లక్షల రూపాయలు ముడుపులు తీసుకుని అప్పనంగా కట్టబెట్టి కోట్ల రూపాయలు సంపాదనే ధ్యేయంగా కూడబెట్టుకున్న అవినీతి మండల సర్వేయర్ జగదీష్ కు రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నాయకులు అండదండలు అందించడం చాలా దుర్మార్గమని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్,పట్టణ కమిటీ సభ్యులు ఎస్.ఏ.చిన్న రహిమాన్ అన్నారు.శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండల సర్వేయర్ గా ఉన్న జగదీష్ గత ప్రభుత్వం నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తూ తన సంపాదనే ధ్యేయంగా కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములను లక్షల రూపాయలుగా ముడుపులుగా తీసుకొని అప్పనంగా భూ బకాసురులకు,రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వ భూములను కట్టబెట్టి కోట్ల రూపాయలు అవినీతి సొమ్మును కూడబెట్టుకున్న సర్వేయర్ జగదీష్ పై విచారణ పేరుతో జిల్లా ఉన్నత అధికారులు వచ్చి కంటి తుడుపు చర్యగా నిర్వహించి అవినీతి సర్వేయర్ కు వంతపాడే విధంగా ఉన్నత అధికారులు కూడా సర్వేయర్ ప్రలోభాలు లొంగి దాసోహం అవ్వడం సిగ్గుచేటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా సర్వేయర్ అవినీతి మరింత పెట్రేగి పోయే విధంగా పూర్వం నుంచి వారసత్వంగా వచ్చేటువంటి రైతుల సొంత పొలాలను,రిజిస్ట్రేషన్ భూములను కూడా డబ్బులు ముట్ట చెప్పిన వారికి ముట్టజెప్పినంతగా పేద రైతుల భూములను తమ సొంత జాగిరిగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేసిన అవినీతి సర్వేయర్ జగదీష్ కు రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నాయకులు వంత పాడుతూ ప్రజలకు, రైతులకు ఏ విధమైనటువంటి సందేశం పంపుతున్నారని వారు ప్రశ్నించారు.ఇలాంటి అధికారులను శిక్షించాల్సింది దేవుడేరుగు కానీ ఒక జిల్లా కలెక్టర్ అవినీతి సర్వేయర్ జగదీష్ ను మరో ప్రాంతానికి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసిన ఇక్కడి నుంచి ఫెవికాల్ వీరుడుగా అతుక్కుపోయిన సర్వేయర్ కు రిలీవ్ ఆర్డర్ ఇచ్చి ఇక్కడికి బదిలీపై వచ్చిన మహిళా సర్వేయర్ కు జాయినింగ్ ఆర్డర్ ఇవ్వాల్సిన మండల, డివిజన్ రెవెన్యూ అధికారులు, కొంతమంది అధికార పార్టీ నాయకులు అవినీతి అధికారులను వెనుకేసుకు రావడం ఏమిటని వారు అన్నారు.ఇలాంటి అవినీతి అధికారులు ఇక్కడే ఉంటే అర కోరగా మిగిలిన ప్రభుత్వ భూములను కూటమి నాయకులు కాజేయడానికి ఇలాంటి అవినీతి సర్వేయర్ జగదీష్ అవసరమని భావిస్తున్నారా అని వారు ప్రశ్నించారు.ఇప్పటికైనా అవినీతి సర్వేయర్ ను రిలీవ్ చేసి వారు చేసిన అవినీతిపై ఏసీబీ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.ఇలాగే అవినీతి అధికారులకు అధికార పార్టీ నాయకులు వంత పాడితే ప్రజలలో ఎండా కడతామని వారు హెచ్చరించారు ఈ సమావేశంలో రాజ్ కుమార్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మనగళం, కర్నూలు కలెక్టరేట్: ఇసుకు అక్రమ రవాణాను అరికట్టాలని, అక్రమార్కులను ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పకడ్బందీగా పర్యవేక్షించాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు.. హంద్రీ, తుంగభద్ర ఇసుక రీచ్ ల వద్ద అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి పత్రిక లలో ప్రతికూల వార్తలు వస్తున్నాయని, రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీ చేస్తున్నారా, లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. అక్రమ ఇసుక రవాణా పై వస్తున్న వార్తలపై వెంటనే స్పందించి పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు వెళ్లి తనిఖీ చేసి కేసులు పెట్టి వాహనాలను సీజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా ఇసుక తరలింపుపై వీఆర్ఓ లు సమాచారం ఇవ్వకుంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు అక్రమ ఇసుక రవాణా కు సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు టౌన్ డీఎస్పీ బాబు ప్రసాద్, ఆర్టీవో భరత్, మైనింగ్ అధికారి రవి చంద్, భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత డయాబెటిక్ రెటినోపతి స్క్రీనింగ్ శిబిరం



మనగళం, కర్నూలు : డాక్టర్ పెద్ద స్వామి శెట్టి వర్ధంతి సందర్భంగా డాక్టర్ ఎన్ పెద్ద స్వామి శెట్టి, సుభద్రాదేవి పబ్లిక్ చారిటబుల్ సొసైటీ నంద్యాల, చలవాది కృష్ణమూర్తి, స్వరాజ్యలక్ష్మి, ఆరవేటి కృష్ణమూర్తి, ప్రమీల దేవిగార్ల సహకారంతో ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్ శిబిరం ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ ఎన్.సి. లక్ష్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీవాసవీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సేవా ప్రముఖ్ కామనూరు మనోహర్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పాణ్యం లోని కుటుంబాలను సర్వే చేసి అధిక రక్తపోటు, చక్కెర వ్యాధిగ్రస్తులను నమోదు చేశారు. కార్యక్రమంలో అమ్మవారిశాల కార్యదర్శి నెరవాటి వెంకటరమణ, శివయ్య, డాక్టర్ నేట్ల మహేశ్వర్ రెడ్డి, తిరుపతయ్య, నెరవాటి శేషకుమార్, నెరవాటి శ్రీనివాసులు, కందుకూరి అనిల్, మారం వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, సక్షమ్ సుబ్బారావు, రంజిత్ కుమర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



మనగళం, కల్లూరు: కల్లూరు అర్బన్ 41వ వార్డు పరిమళ నగర్ అన్న క్యాంటీన్‌ను శుక్రవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లను సీఎం చంద్రబాబు నాయుడు పునః ప్రారంభించారని తెలిపారు. పేదవాడి కడుపు నింపేందుకు రుచిగా అన్ని వసతులతో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

## మిట్టకందాలలో పర్యటించిన మలేరియా అధికారి




మనగళం, పాములపాడు: నంద్యాల జిల్లా మలేరియా అధికారి చందశేఖర్ రావు శుక్రవారం పాములపాడు మండలం, మిట్టకందాల గ్రామంలో పర్యటించారు. “ఫ్రైడే డ్రై డే “ కార్యక్రమం లో భాగంగా ఇళ్లను పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్, అంటు వ్యాధుల వ్యాప్తి గురించి ప్రజలకు తెలియజేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ప్రతీ రోజు ఇంటింటి కి తిరిగి జ్వర సర్వే ను నిర్వహించాలని, రక్త నమూనాలు సేకరించాలన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య సూత్రాలు వివరించి చైతన్య పరచాలని ఆయన వైద్య సిబ్బందిని ఆదేశించారు.

## ప్రగతి పనులను వేగవంతం చేయాలి

– పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి



మనగళం, కర్నూలు సిటీ: నగరంలో ప్రగతి పనులను వేగవంతం చేయాలని, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 6 వార్డుల్లో రూ.2.30 కోట్ల విలువ అభివృద్ధి పనులకు కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎన్‌క్యాప్ నిధులతో 32, 35వ వార్డుల పరిధిలో చెన్నమ్మ సర్కిల్ నుండి ఏపిఐఐసి కార్యాలయం వరకు రూ.90 లక్షలతో రహదారి విస్తరణ, 36వ వార్డు వై.జంక్షన్ నుండి పెద్దపాడు వరకు రూ.25 లక్షలతో డివైడర్లలో పచ్చదనం పెంపు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే సాధారణ నిధులతో 30వ వార్డులో సుంకులమ్మ ఆలయం నుండి హంద్రీ నది వరకు రూ.49.95 లక్షలతో డిస్పోజబుల్ డ్రైన్, 37వ వార్డు శరీన్ నగర్ నందు రూ.50 లక్షలతో సిసి డ్రైన్, 41వ వార్డు సిద్దార్థ హెూమ్ నందు రూ.15 లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే, కమిషనర్ శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జయరాముడు, ఎంఈ లీల ప్రసాద్, డీఈఈ క్రిష్ణలత, ఏఈ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## తిరుపతిలో డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవా

మన గళండోన్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులు ఉద్యోగం కోసం తిరుపతికి వెళ్లగా అక్కడి వారు వారిని మోసం చేసారని, వారి పైన చర్యలు తీసుకోవాలని, వీటికి కారణమైన కళాశాల ప్రిన్సిపాల్ ను, ఆధ్యాపకుడిని సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా %ూ×ూఖీ% నంద్యాల జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ గారు మాట్లాడుతూ‘ డోన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులు అక్కడి అధ్యాపకుడి రికమండేషన్ తో, విద్యార్థులు జనవరి మొదటి వారంలో తిరుపతిలో జరిగిన ఉద్యోగ ఎంపికలకు హాజరయ్యారు. అక్కడికి చేరుకున్న ఆరు మంది విద్యార్థుల పై కొందరు దాడిచేసి వారి నుంచి చరవాణుల(మొబైల్స్)తో పాటు రూ.35 వేల నగదు లాక్కునారనీ,ఈ విధంగా మోసపోయామని తిరుపతికి పంపించిన అధ్యాపకుడి, ప్రిన్సిపాల్ కు వేరే వారు ఫోన్ ద్వారా సమాచారం అందించగా... చోరీ, దాడి జరిగిన విషయం ఎవరికీ చెప్పకుండా తిరుపతి నుంచి డోన్ కు రావాలని వారు చెప్పడంతో చేసేది లేక విద్యార్థులకు వెనక్కి వచ్చి, అక్కడే జరిగిన సంఘటన వారి స్నేహితులకు గాని అధ్యాపకులకు గాని బయట వ్యక్తులకు గాని ఎవరికి చెప్పవద్దని, చెబితే మీ పైన చర్యలు తీసు కుంటా మని వారు విద్యార్థు లను హెచ్చరిం చడం పై, వారు మండిపడ్డారు. గతంలో ఇలాంటి సంఘటన లు చాలా జరిగాయని, కావున వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, ఈ సంఘటనకు కారణమైన ప్రిన్సిపల్ మరియు అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## అమీర్‌మియ్యా భవనం సామర్థ్య స్థితిపై తనిఖీ

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని పాతబస్తీ చిదంబరావు వీధిలో శిథిలావస్థలో ఉన్న అమీర్‌మియ్యా భవనాన్ని శుక్రవారం బెంగుళూరుకు చెందిన బ్యూరో వెరిటాస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ తనిఖీ చేసింది. పురాతన భవనం ప్రమాదమని భావించి నగరపాలక సంస్థ సదరు భవన సామర్థ్య స్థితిపై బ్యూరో వెరిటాస్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తుంది. 2,3 రోజుల పాటు ఈ సర్వే కొనసాగనుంది. అనంతరం బ్యూరో వెరిటాస్ నివేదిక ఆధారంగా నగరపాలక అధికారులు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. కార్యక్రమంలో బ్యూరో వెరిటాస్ సంస్థ ప్రతినిధులు, పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



## విద్యుత్ అంతరాయం...



మన గళండోన్ మండలంలోని డోన్ టౌన్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి వెంకటాపురం ఫీడర్ కింద రూరల్ డెవలప్మెంట్ (%=ఞూ%)ఆధ్వర్యంలో లైన్ పనులు జరుగుతున్నందున అబ్బిరెడ్డిపల్లి, వెంకటాపురం, గుమ్మకొండ, బొంతిరాళ్ల గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు అంతరాయం ఉంటుందని అలాగే రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంట్ తెల్లవారుజామున ( రాత్రి)3 గంటల నుంచి 10 గంటల వరకు మరియు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇవ్వడం జరుగుతుందని విద్యుత్ డిప్యూటీ ఇంజనీర్ నాగేంద్ర మరియు రూరల్ ఏఈ నాగేశ్వర రెడ్డి తెలియజేశారు.


## 22న దివ్యాంగుల సాధికారత ఫోరం ఆవిర్భావ దినోత్సవం

మనగళం, ఎమ్మిగనూరు : దివ్యాంగుల సాధికారత ఫోరం (డీఈఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన ఘనంగా నిర్వహిస్తామని ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆల్ఫ్రెడ్ రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు బి సి నాగరాజు, కార్యవర్గ సభ్యులు టీడీపీ జిల్లా అధ్యక్షులు పి తిక్క రెడ్డిని ఎమ్మిగనూరు పట్టణంలో ఆయన నివాసంలో కలిశారు. కర్నూలులోని “శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపం” లో నిర్వహించే “దివ్యాంగుల సాధికారత ఫోరం” (డిఈఎఫ్) ఆవిర్భావ దినోత్సవ సభ కు సంబంధించిన ఆహ్వాన పత్రికను వారు తిక్కారెడ్డిక అందజేశారు. స్పందించిన తిక్కారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సామాజిక, సంక్షేమాభివృద్ధికై కట్టుబడి ఉందన్నారు. డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సభకు తగిన సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఎఫ్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి నర్సింహులు, ఎం. రామకృష్ణ, ఈ. రాజశేఖర గౌడ్, బి. చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.



## నల్లమలలో పెరిగిన పులుల సంఖ్య





మనగలం :శ్రీశైలం లెఫ్ట్, తెలంగాణ, రిజర్వ్ లో పెద్దపులుల సంతతి గణనీయంగా పెరిగిందని జిల్లా ఫారెస్ట్ అధి కారి రోహిత్ గోపిడి తెలిపారు. గురువారం మీడియాకు ఒక ప్రకటన ద్వారా తెలుపుతూ 2024,25 సంవత్సరం నిర్వహించిన 4వ ఫేజ్ సర్వే వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లోని పది రేంజ్లను నాలుగు బ్లాకులుగా విభజించి సాంకేతిక పద్ధతిలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. 20 డిసెంబర్ 2024 నుండి మే 15, 2025 వరకు 1594 కెమెరాలను బిగించి సర్వే నిర్వహించామని 797 గ్రిడ్లలో ప్రతి రెండు చదరపు కిలోమీటర్లకు కెమెరాలను ఏర్పాటు చేసి కెమెరా ట్రాప్ ద్వారా పాదముద్రలు, మల విసర్జన, స్కాప్ మార్కులు, రేక్ మార్కుల ద్వారా సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. దీని ద్వారా రెండేళ్ల క్రితం 26గా ఉన్న పులుల సంఖ్య ప్రస్తుతం 36కి చేరినట్లు తెలి పారు. వీటిలో 13 మగ పులులు, 20 ఆడ పులులు కాగా 3 లింగ నిర్ధా రణ కాని పులి కూనలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆడ పులుల సంఖ్య గణనీయంగా పెరగడం ద్వారా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ భవిష్యత్తులో పులుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రగతికి ప్రధాన కారకులు అటవి శాఖ సిబ్బంది, ఫ్రంట్ లైన్ కార్మికులు, అదే విధంగా స్థానిక ప్రజల సహకారం, ప్రాజెక్టు టైగర్ కింద చేపట్టిన అవరోధ నిరోధక చర్యలు, హ్యాబిటల్ పరిరక్షణ, అదే విధంగా సమగ్ర పర్యవేక్షణ ఈ విజ యానికి దోహదపడిందని, తెలంగాణ అటవి శాఖ అమ్రాబాద్ టైగర్ రిజ రలో పులుల దీర్ఘకాలిక సంరక్షణ కోసం మరింత బలమైన చర్యలు తీసు కోవడానికి కట్టుబడి ఉందని తెలిపారు.



## కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరించండి



మనగళం, ఓర్వకల్లు : ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ మాత్రం అమలు చేయడం లేదని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. కూటమి సర్కార్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓర్వకల్లు మండల పార్టీ అధ్యక్షులు చెన్నారెడ్డి అధ్యక్షతన “బాబు షురూటీ ౧ మోసం గ్యారంటీ” కార్యక్రమంలో భాగంగా మండలం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి హాజరైన కాటసాని కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఏ ఒక్క హామీని అమలు చేయలదని, పాలకులు మాయమాటలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. వైసీపీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే... చంద్రబాబు చేసిన మోసాలు తెలుస్తాయన్నారు. మండల, గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని, బాబు మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కాటసాని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓర్వకల్లు మండల నాయకులు, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 25న ఛలో విజయవాడ

మనగళం, కర్నూలు సిటీ: కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూలై 25 న విజయవాడలో ధర్నా చౌక్ జరగబోయే మహాధర్నా జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడ గాంధీ నగర్ లోని పీడీఎస్ యూ కార్యాలయంలో మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిందని, అయితే విద్యా రంగ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో పాఠశాల విలీన ప్రక్రియ వలన వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేటు ప్రైవేటు విద్యాసంస్థల్లో వివిధ రకాల పేర్లతో జరుగుతున్న ఫీజుల దోపిడీ అరికట్టాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను, రాష్ట్ర కోశాధికారి రూప శంకర్, రాష్ట్ర నాయకులు నాగరాజు, శ్రీను, షాహీద్, నవీన్, దినేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్ టీజింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు

మనగళం, కర్నూలు క్రైం: ఈవ్ టీజింగ్, ఆకతాయి పనులకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ఇప్పటి వరకు 64 మందికి కౌన్సిలింగ్ ఇచ్చామని, ఇలాంటి చర్యలు మానుకోవాలని సూచించారు. కర్నూల్ డీఎస్పీ జె. బాబు ప్రసాద్, కర్నూల్ టౌన్ లో సిఐలు మహేశ్వర్ రెడ్డి, విజయలక్ష్మి ఆధ్వర్యంలో 11 మఫ్టీ పోలీసు బృందాలతో యాంటీ ఈవ్ టీజింగ్ బీట్ లను ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు మఫ్టీ పోలీసులు కర్నూలు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టల్స్, షాపింగ్ మాల్స్, రైల్వే స్టేషన్, తదితర పరిసర ప్రాంతాలలో యాంటీ ఈవ్ టీజింగ్ మఫ్టీ పోలీస్ బృందాలు తనిఖీ చేస్తున్నారు. ఎక్కడైనా మహిళలకు, విద్యార్థినిలకు సమస్యలు ఉన్నట్లయితే డయల్ 112 కాల్ చేసి నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన శక్తి ఎస్ఓఎస్ యాప్ లేదా శక్తి వాట్సప్ 7993485111 నెంబర్ కి మెసేజ్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

శనివారం
19 - 07 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

సమాజ సేవకు నూతనరూపం
బ్యాంకుల జాతీయీకరణం

1969లో భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక ప్రధాన మలుపుగా నిలిచిన సంఘటన బ్యాంకుల జాతీయీకరణ.అదే ఏడాది జూలై 19న, ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నాయకత్వంలో భారత ప్రభుత్వం తీసుకున్న బ్యాంకుల జాతీయీకరణ నిర్ణయం దేశ ఆర్థిక రంగాన్ని, ముఖ్యంగా బ్యాంకింగ్ వ్యవస్థను సమూలంగా మార్చేసింది. అప్పటి వరకు బ్యాంకింగ్ రంగం ఒక పరిమిత వర్గానికి మాత్రమే సేవలందించేది. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తలు, పెద్ద రైతులు, పట్టణ వాణిజ్య వర్గాలకే ఇది అందుబాటులో ఉండేది. గ్రామీణ భారతం, వ్యవసాయ రంగం, చిన్న పరిశ్రమలు, పేద ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉండిపోయారు. ఈ పరిస్థితిని మార్చాలని భావించిన ఇందిరా గాంధీ ప్రభుత్వం "బ్యాంకింగ్ ఆన్ ది డోర్ స్టెప్ ఆఫ్ ద పూర్" అనే ధ్యేయంతో బ్యాంకుల జాతీయీకరణ చర్యను చేపట్టింది. 1960వ దశకం భారతదేశానికి ఆర్థికంగా, రాజకీయంగా అనేక సవాళ్లను ఎదుర్కొన్న కాలం. స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్నారు. ప్రైవేట్ బ్యాంకులు, ఎక్కువగా పారిశ్రామిక వర్గాల నియంత్రణలో ఉండి, ప్రధానంగా పెద్ద పరిశ్రమలు మరియు స్థాపిత వ్యాపారాల క్రెడిట్ అవసరాలను తీర్చడానికి మొగ్గు చూపాయి. వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమలు మరియు ఇతర ప్రాధాన్యత రంగాలను నిర్లక్ష్యం చేశాయి. ఇది రుణ పంపిణీలో గణనీయమైన అసమానతలకు దారితీసింది, సమ్మిళిత ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగించింది. అలాంటి పరిస్థితులలో...జాతీయీకరణ ద్వారా ప్రభుత్వం, బ్యాంకులలో డబ్బులను నిర్లక్ష్యం చేయబడిన రంగాలకు మళ్లించగలదని, తద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించవచ్చని మరియు పేదరికాన్ని తగ్గించవచ్చని భావించారు. ప్రధానంగా నికర డిపాజిట్లు 50 కోట్లకు మించిన 14 ప్రైవేట్ షెడ్యూల్డ్ బ్యాంకులను జాతీయీకరించారు. వీటిలో అల్లాహాబాద్ బ్యాంక్, బాంక్ ఆఫ్ బరోడా, బాంక్ ఆఫ్ ఇండియా, బాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేనరా బ్యాంక్, దేనా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ ఉన్నాయి. ఈ బ్యాంకులు దేశ డిపాజిట్లలో 85% వరకూ నిర్వహిస్తున్నట్లుగా ఉండటంతో వాటి జాతీయీకరణ ద్వారా ప్రభుత్వానికి అధిక ఆర్థిక నియంత్రణ కలిగింది. బ్యాంకింగ్ రంగాన్ని సామాజిక అభివృద్ధికి వినియోగించే దిశగా ఇది మలుపు తీసుకొచ్చింది. బ్యాంకుల జాతీయీకరణ ద్వారా కొన్ని ప్రధాన లక్ష్యాలు చేరుకోవడం జరిగింది – వ్యవసాయ రంగానికి, చిన్న పరిశ్రమలకు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రుణాలందింపు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంక్ శాఖల విస్తరణకు ఇది నాంది పలికింది. జాతీయీకరణ వల్ల ప్రధానంగా నాలుగు ప్రధాన మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకటి... గ్రామీణ బ్యాంకింగ్ విస్తరణ. రెండోది...వ్యవసాయ, మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజులకు రుణాల లభ్యత. మూడోది ... ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకుల మద్దతు. నాలుగోది ... మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఇతర బహిష్కృత వర్గాల ఆర్థిక చేర్పు. 1969 నాటికి దేశవ్యాప్తంగా 8,200 బ్యాంక్ శాఖలే ఉండగా, 1991 నాటికి వాటి సంఖ్య 60,000 దాటింది. ఇందులో 30,000కు పైగా గ్రామీణ శాఖలు. వ్యవసాయరంగానికి బ్యాంకులు ఇచ్చిన రుణాల శాతం 1969లో 2.2% ఉండగా, 1980 నాటికి 15.8%కి పెరగడం గమనార్హం. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలు మొదటిసారిగా అధికారిక ఆర్థిక వ్యవస్థకు చేరువయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిరుద్యోగ భృతి, రైతు రుణ మాఫీ, విద్యా రుణాలు మొదలైనవి బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా అమలవుతూ వచ్చాయి. ఇక ఇందిరా గాంధీ పాలనకు ఇది రాజకీయంగా పెద్ద బలాన్ని ఇచ్చింది. బ్యాంకుల జాతీయీకరణ పేద ప్రజల్లో మద్దతును పెంచడంతో పాటు, ఆమెను సామాజిక న్యాయమూర్తిగా ప్రజల్లో ప్రతిష్ఠించేందుకు దోహద పడింది. అయితే 1970లో సుప్రీంకోర్టు ఈ ఆర్డినెన్స్‌ను కొంతవరకూ చట్టవిరుద్ధంగా ప్రకటించడంతో, ప్రభుత్వం చట్ట సవరణ చేసి తిరిగి జాతీయీకరణను అమలు చేసింది. దీనికితోడు 1980లో మరోసారి ఆరు ప్రైవేట్ బ్యాంకులను జాతీయీకరించడం జరిగింది. వీటితో కలిపి ప్రభుత్వ యాజమాన్యం లోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల సంఖ్య 20కి చేరింది. అయితే జాతీయీకరణ తరువాత కూడా సమస్యలు లేవని చెప్పలేం. బ్యాంకుల్లో రాజకీయ దుర్వినియోగం, సంక్షేమ పథకాల పేరిట నష్టరుణాల మాఫీ, నిర్వాసిత ఆస్తుల శాతం పెరగడం, ప్రభుత్వ నియామకాల వల్ల పరిపాలనలో నైపుణ్యాల కొరత వంటి అంశాలు వ్యాపించాయి. అయినా ఇవన్నీ కలిపి చూసినపుడు, జాతీయీకరణ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక సుదీర్ఘ, సామాజిక ధోరణిలో దిక్సూచి చూపడం జరిగింది. దేశంలో సగానికి పైగా జనాభా బ్యాంకింగ్ సేవలకు మించి ఉండే స్థితిలో ఉన్నది ఈ విధానానికే ఫలితం. 1991 ఆర్థిక సంస్కరణల అనంతరం ప్రైవేట్ బ్యాంకులకు తిరిగి ప్రవేశం లభించినా, జాతీయీకరణ ద్వారా ఏర్పాటైన బ్యాంకింగ్ మౌలిక సదుపాయాలు, సామాజిక దృక్కోణం భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపాయి. నేటి ఆర్థిక చర్చల్లో బ్యాంకుల విలీనాలు, సంస్థాగత పునఃనిర్మాణం, డిజిటల్ బ్యాంకింగ్ వంటి అంశాలు ముందుకు వస్తున్నా %–% వాటికి బీజం వేసింది 1969లో తీసుకున్న బ్యాంకుల జాతీయీకరణే. ఇది కేవలం పాలనా నిర్ణయం కాదు, దేశ ఆర్థిక ప్రణాళికలో ఒక మైలురాయిగా నిలిచింది. పేదల ఆర్థిక చేర్పును, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న విధానాల మొదటి మెట్టు ఇదే. ఇలాంటి చర్యల ద్వారానే సమతా, సమగ్ర అభివృద్ధికి దారులు వెలుస్తాయి.

## సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి..



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంటి విజనరీ లీడర్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు నియోజకవర్గం వేల్పూరు గ్రామంలో ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణతో కలిసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఏ ఏ పథకాలు అందాయని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తల్లికి వందనం డబ్బులు తల్లుల అకౌంట్లో జమ చేశామని, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తామని ఆయన చెప్పారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నారన్నారు. ఏడాదిలోనే రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టబడులు వచ్చాయన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశలో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు వయస్సును ఉద్దేశించి వైసిపి నేతలు ఇష్టానుసారంగా మాట్లాడడం బాధాకరమన్నారు. తమ పార్టీలో కిందిస్థాయి కార్యకర్త నుంచి పై నాయకులు వరకు అందరూ క్రమశిక్షణతో ఉంటారని.. వైసిపి నేతల మాదిరిగా ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేయరన్నారు. వైయస్ జగన్ వందేళ్లపాటు బ్రతకాలని తాము కోరుకుంటున్నామని.. ఎందుకంటే ఆయన ఉన్నన్ని రోజులు ప్రజలు తమ వైపే ఉంటారని, తమ ప్రభుత్వం తప్పకుండా ఇలాగే కొనసాగుతుందన్నారు. తనుకు నియోజవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే అరెమిల్లి రాధాకృష్ణ ఎంతో కృషి చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఈ ప్రాంతంలో ఎమ్.ఎస్. ఎమ్.ఈ పార్కు ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు పలు అభివృద్ధి పనులకు మంత్రి, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వన్ డే స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్" ప్రొగ్రామ్ కు శ్రీకారం



మనగళం, బనగానపల్లె : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా రంగంలో వినూత్న ఆవిష్కరణలకు వీలు కల్పించే విధంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆలోచనల మేరకు శుక్రవారం బనగానపల్లె నియోజకవర్గంలో రాష్ట్రంలోనే తొలిసారిగా "ఒకరోజు స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్" ను లాంఛనంగా ప్రారంభించడం జరిగిందని ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు తెలిపారు.. బనగానపల్లె బాలికల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సైన్స్ సిటీ సీఈవో కె. వెంకటేశ్వర్లు, ముస్కాన్ కంపెనీ ప్రతినిధులు, సమగ్ర సర్వశిక్ష అభియాన్ అధికారులు, డిప్యూటీ డీఈవో డోన్, బనగానపల్లె ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్పేస్ రాకెట్స్ కు సంబంధించి పరికరాలను విద్యార్థులకు ప్రదర్శించి చూపించడం జరిగింది. అదే సమయంలో స్పేస్ సంబంధింత పరికరాలను కలపడం, విడదీయడం (డిస్ మ్యాండిల్) చేయడం కూడా ప్రాక్టీకల్ గా విద్యార్థులకు చూపించడం జరిగింది. ఈ వన్ డే స్పేష్ ఎడ్యుకేషన్ క్యాంప్ ను బనగానపల్లె నిర్వహించేందుకు ప్రోత్సహించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి స్థానిక విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## అన్ని వైద్య సేవలు ఉచితంగా అందజేయాలి



మనగళం, నంద్యాల: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా కలెక్టరేట్లోని తమ ఛాంబర్ నందు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ స్కీం కింద వైద్యాధికారులతో డిడిసి(జిల్లా డిసిప్లైనరీ కమిటీ) సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య అభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఐవిఆర్ ఎస్, మెడికల్ ఆడిట్ కేసులకు సంబంధించి రివ్యూ చేశారు. మొత్తం 12 కేసులకు సంబంధించి ఆసుపత్రుల ద్వారా అమౌంట్ రోగులకు ఇప్పించడం జరిగింది. ఇకనుంచి ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగుల నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయరాదని, అన్ని వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలన్నారు. అలా చేయని పక్షంలో పదింతల వరకు అపరాధ రుసు విధించడం తోపాటు ఆసుపత్రి లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఓ.లలిత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వై.రూపేంద్ర నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## "సూపరిపాలనే" ఓటమి ప్రభుత్వ ధ్యేయం



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని అమ్మడగుంట్ల గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. కే డి సి సి బి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, టిడిపి నాయకులు సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోడుమూరు మండల టిడిపి కన్వీనర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా, పింఛన్, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాల అమలుపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, బూత్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి

- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలి
- పర్యాటక ప్రదేశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, నంద్యాల: నంద్యాల జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని తన చాంబర్లో.. జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటికి తీసుకున్న చర్యలు, ఇంకను చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 24 పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జిల్లాలో చాలెంజ్ బేస్ డేస్టినేషన్ కింద అహోబిలంలో రూ.25 కోట్లతో జరుగు అభివృద్ధి కార్యక్రమాలు అటవీ శాఖతో సమన్వయం చేసుకొని తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకు డిఎఫ్ఓతో పర్యాటక అధికారులు, ఇంజనీర్స్ చర్చించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అప్రూవల్ కి పంపించాలని సూచించారు. బేలుం కేవ్స్ నందు బ్రిడ్జ్ త్వరగా పూర్తి చేయాలని, అక్కడ నీటి వసతికి ఇబ్బంది లేకుండా చూడాలని, అలాగే సిసి కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలోని అన్ని పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించి పర్యాటక ప్రదేశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ అనురాగ్ శర్మ, పర్యాటక ఇన్చార్జి అధికారి సత్యనారాయణ, డిపిఆర్ఓ పురుషోత్తం, ఎస్ఈ ప్రతాప్, టూరిజం అధికారులు, ఇంజనీర్లు, ఆర్కియలాజి, ఎండోమెంట్, కేసి కెనాల్, ఎడ్యుకేషన్, హెూటల్ అసోసియేషన్, స్పోర్ట్స్, సంబందిత అధికారులు పాల్గొన్నారు.




# ఆర్బీఐ ఎఫెక్ట్, ఒక్క రోజులో 3.5 లక్షల కోట్లకు పైగా లాభం



మనగళం, : ఇవాళ భారత స్టాక్ మార్కెట్లు బ్లాక్‌బస్టర్ ఫ్రైడేని చవిచూశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటు తగ్గింపుతో నిఫ్టీ 25,000 మార్క్ దాటింది. బ్యాంక్ నిఫ్టీ అయితే, ఏకంగా రికార్డు గరిష్ట స్థాయికి చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఊహించిన దానికంటే ఎక్కువ రెపో రేటు తగ్గింపుతో పాటు నగదు నిల్వ నిష్పత్తి (జ==) ఝుంప్ర =వంవతీజవ =ఛ్అశీ తగ్గింపుతో ఇవాళ (జూన్ 6)న భారత బెంచ్‌మార్క్ సూచీలు మూడవ సెషన్‌లోనూ లాభాలు మూటగట్టుకున్నాయి. ఇక, నిఫ్టీ మూడు వారాల్లో ఉత్తమ ట్రేడ్ డే ను నమోదు చేసింది. శుక్రవారం వారాంతంలో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 746.95 పాయింట్లు లేదా 0.92 శాతం పెరిగి 82,188.99 వద్ద ఉంది. నిఫ్టీ 252.15 పాయింట్లు లేదా 1.02 శాతం పెరిగి 25,003.05 వద్ద ఉంది. ఇక, నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.2 శాతం పెరగగా, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం పెరిగాయి. ఇక, బిఎస్ఇ-లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ నిన్నటి రూ. 447.5 లక్షల కోట్ల నుండి రూ.451 లక్షల కోట్లకు పెరగడంతో పెట్టుబడిదారుల సంపద ఒక్కరోజులో రూ. 3.5 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించాలనే నిర్ణయం జువీ×లను తగ్గిస్తుందని అంచనా వేయడం, హోం లోన్స్ ఇచ్చే బ్యాంకు షేర్లకు ఊతం వచ్చింది. దీంతో బ్యాంకింగ్ స్టాక్స్ తోపాటు రియాల్టీ ఇండెక్స్ 4 శాతం పెరిగింది. దీంతోపాటు, బంగారు రుణాలకు సంబంధించి లోన్-టు-వాల్యూ నిష్పత్తి పరిమితిని 85%కి పెంచుతామని ఆర్‌బిఐ చెప్పడంతో గోల్డ్ ఫైనాన్సింగ్ కంపెనీల షేర్లు 5 నుంచి 7 శాతం వరకూ పెరిగాయి. ఆర్బీఐ తాజా నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.2.5 లక్షల కోట్ల లిక్విడిటీని ఇంజెక్ట్ చేయడానికి దోహదపడింది. ఆర్బీఐ.. జ==ని దశలవారీగా 100 బేసిస్ పాయింట్లు తగ్గించి 3%కి తీసుకురావడంతో ఇది సాధ్యమైంది. తద్వారా బ్యాంకుల దగ్గర నగదు నిల్వలు పెరిగి మరిన్ని రుణాలిచ్చేందుకు వీలవుతుంది. ఫలితంగా మార్కెట్లోకి మనీ మరింతగా వస్తుంది. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ ఆర్బీఐ 9.5లక్షల కోట్ల డబ్బును వ్యవస్థలోకి తీసుకువచ్చింది. ఆర్బీఐ తాజా నిర్ణయాలతో నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 1.5 శాతం పెరిగి కొత్త రికార్డు గరిష్ట స్థాయి 56,695కి చేరుకుంది. ఆటో, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్‌లు ఒక్కొక్కటి 1 శాతానికి పైగా పెరిగాయి. మరోవైపు, మీడియా ఇండెక్స్ 1 శాతం తగ్గింది. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి ఉన్నాయి. అయితే హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, భారత్ ఎలక్ట్రానిక్స్, టాటా స్టీల్, భారతి ఎయిర్‌టెల్, సన్ ఫార్మా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

# పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా తగ్గనున్నాయా?



మనగళం, : పెట్రోల్, డీజిల్ ధరలు త్వరలో తగ్గే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి సూచించారు. ముడి చమురు ధరలు రాబోయే రెండు, మూడు నెలలు ప్రస్తుత స్థాయిలోనే ఉంటే, భారతదేశం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించే అవకాశం ఉందని ఆయన గురువారం అన్నారు. భారతదేశం వివిధ దేశాల నుండి ముడి చమురును దిగుమతి చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. మన దగ్గర తగినంత చమురు ఉంది. ఇంధన భద్రత కోసం, భారతదేశం గతంలో కంటే ఎక్కువ దేశాల నుండి చమురు కొనుగోలు చేసే విధానంపై పనిచేస్తోందని అన్నారు. ఇదిలా ఉండగా, భారతదేశం తన ముడి చమురు దిగుమతి నెట్‌వర్క్‌ను గతంలో కంటే విస్తరించిందని పూరి అన్నారు. భారతదేశం ఇప్పుడు 27 దేశాల నుండి కాకుండా 40 దేశాల నుండి చమురును దిగుమతి చేసుకుంటోంది. చమురు మార్కెట్ వృద్ధిలో 16% భారతదేశం నుండే వచ్చిందని, కొన్ని నివేదికలు ఇది 25% వరకు పెరగవచ్చని చెబుతున్నాయి. రష్యా నుండి చమురు కొనుగోలు చేసే దేశాలపై ద్వితీయ ఆంక్షలు విధించే అమెరికా బెదిరింపుపై పూరి మాట్లాడుతూ, ప్రపంచంలోని మొత్తం చమురు ఉత్పత్తిలో రష్యా 10% వాటాను కలిగి ఉందని అన్నారు. రష్యా లేకపోతే చమురు ధర బ్యారెల్‌కు వి130 వరకు పెరిగేదని డేటా చూపిస్తుందన్నారు. టర్కీ, చైనా, బ్రెజిల్, యూరోపియన్ యూనియన్ కూడా రష్యా నుండి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేశాయన్నారు. గత వారం రష్యా నుండి ముడి చమురు కొనుగోలును కొనసాగించడం వల్ల ప్రపంచ ఇంధన ధరలు స్థిరంగా ఉండవచ్చని, లేకుంటే రష్యా నుండి చమురు దిగుమతులను నిలిపివేసి ఉంటే ముడి చమురు ధర బ్యారెల్‌కు వి120-130కి చేరుకునేదని మంత్రి అన్నారు.

# పీరియడ్స్ సమయంలో ఈ తప్పులు చేయకూడదు..

మనగళం, : కొన్ని విషయాల పట్ల పెద్దలు చాలా జాగ్రత్తలు చెబుతుంటారు. కానీ మీకేం తెలుసే ముసలొల్లు అని కొట్టిపారేస్తారు ఈ కాలం జనరేషన్ అమ్మాయిలు. అయితే పీరియడ్స్ సమయంలో కూడా కొన్ని విషయాలను చెబుతారు.కానీ వింటేగా.. అయితే పీరియడ్స్ సమయంలో కడుపు నొప్పి, నడుము నొప్పి వంటివి ఇబ్బంది పెడతాయి. మానసికంగా కూడా ఈ సమయంలో కాస్త ఇబ్బందిగానే అనిపిస్తుంటుంది. కానీ తెలిసి తెలియక కొన్ని తప్పులు చేస్తుంటారు. మరీ ఈ పీరియడ్స్ సమయంలో చేయకూడని తప్పులు ఏంటో చూసేద్దామా?వాక్సింగ్.. పీరియడ్స్ సమయంలో వాక్సింగ్ చేయకూడదు. దీనివల్ల సున్నితత్వం, నొప్పి మరింత పెరుగుతుంది. రుతుస్రావం సమయంలో హార్మోన్ల హెచ్చుతగ్గులు స్కిన్ ను సున్నితంగా చేస్తాయి. వాక్సింగ్ సెషన్ లలో అసౌకర్యాన్ని పెంచుతాయి. అసౌకర్యం తగ్గడానికి పీరియడ్స్ కు ముందు, తర్వాత వ్యాక్సింగ్ చేయించుకోవడం మంచిది. నీరు తక్కువ తీసుకోవడం.. పీరియడ్స్ లో కలిగే ఇబ్బంది వల్ల చాలా మంది మహిళలు నీరు తాగడం మర్చిపోతుంటారు. యూరిన్ కు ఎక్కువ సార్లు వెళ్లాల్సి వస్తుందని మరింత భయపడతారు. కానీ ఈ సమయంలోనే మంచినీరు ఎక్కువ తీసుకోవాలి. హైడ్రేటెడ్ గా ఉంచడం చాలా ముఖ్యం. ఈ సమయంలో నీరు ఎక్కువగా తాగడం వల్ల కడుపు ఉబ్బరం, తిమ్మిరి, తలనొప్పి వంటి సమస్యలు రావు.పెయిన్ తగ్గించే మందులు.. పీరియడ్స్ లో నొప్పి ఎక్కువగా ఉంటుంది. కానీ దాన్ని తగ్గించుకోవడానికి టాబ్లెట్స్ మాత్రం వాడకూడదు అంటారు నిపుణులు. ఇవి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను కలిగిస్తాయి. ఇబుప్రోఫెన్ వంటి నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ మితిమీరిన వినియోగం వల్ల జీర్ణ సమస్యలు, ఇతర సమస్యలు వస్తాయట. మందుల మీద ఆధారపడకుండా రుతుక్రమ అసౌకర్యాన్ని తగ్గించే హీట్ థెరపీ సున్నితమైన వ్యాయామం వంటివి చేయాలి. నిద్ర.. పీరియడ్స్ సమయంలో మంచి నిద్ర చాలా అవసరం. కానీ కొందరు పెయిన్ వల్ల, బ్లీడింగ్ వల్ల ఎక్కువగా నిద్రకు దూరం అవుతుంటారు. దీనివల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. పీరియడ్స్ పెయిన్ మరింత పెరుగుతుంది. అలసట, తిమ్మిర్లు, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలు వస్తాయి. ఈ సమయంలో 8 నుంచి 9 గంటలు నిద్ర పోవాల్సిందే. షుగర్ ఫుడ్స్, కెఫిన్.. ఈ సమయంలో కాఫీలు, షుగర్ ఫుడ్స్ తినకూడదు. పీరియడ్స్ సమయంలో ఈ పదార్థాలు తినాలి అనిపిస్తుంది కానీ మితంగా తినాలి. హెర్బల్ టీలు, డార్క్ చాక్లెట్, ఆరోగ్యకరమైన పండ్లతో కోరికలు తీర్చుకుంటే సరిపోతుంది అంటున్నారు నిపుణులు.



# బెంట్లే సిస్టమ్స్ అత్యాధునిక సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రదర్శన



మనగళం, : ప్రముఖ ఇంజనీరింగ్ టెక్ దిగ్గజం బెంట్లే సిస్టమ్స్ గురువారం హైదరాబాద్‌లో తమ అత్యాధునిక సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌లను ప్రదర్శించింది. ఇవి భారతదేశంలో మెట్రో, నీటి సరఫరా, విద్యుత్ రవాణా, ఎయిర్‌పోర్ట్ విస్తరణ, 3డి సిటీ మ్యాపింగ్ వంటి బహుళ రంగాల్లో విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయని బ్రెంట్లే సిస్టమ్స్ సౌత్ ఏసియా రీజినల్ ఎగ్జిక్యూటివ్ కమలకన్నన్ తిరువది తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన బెంట్లే ఇన్నోవేషన్ డేలో పాల్గొన్న కమలకన్నన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమ సాఫ్ట్‌వేర్ జల్ జీవన్ మిషన్, అమృత్ ప్రాజెక్ట్, నాగ్‌పూర్‌లో నీటి లీకేజీ తగ్గింపు వంటి కీలక ప్రాజెక్టులలో డిజిటల్ ట్విన్ టెక్నాలజీ ద్వారా ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, నిర్వహణ దశలను సమర్థవంతంగా నిర్వహిస్తోన్నామన్నారు. నాగ్‌పూర్‌లో నీటి లీకేజీ తగ్గింపు వంటి ప్రాజెక్టులలో డిజిటల్ ట్విన్ టెక్నాలజీ ద్వారా ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, నిర్వహణ దశలను సమర్థవంతంగా నిర్వహిస్తోన్నామన్నారు. విద్యుత్ రంగంలో ట్రాన్స్‌మిషన్ టవర్‌ల డిజైన్, నిర్వహణ, 3డి మోడలింగ్‌లో బెంట్లే సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతోందన్నారు.

# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు



మనగళం, : అంతర్జాతీయంగా పసిడికి ఎప్పుడూ డిమాండే ఉంటుంది.. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కోసారి పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతూ వస్తుంటాయి.. అయితే.. ఇటీవల కాలంలో బంగారం, వెండి ధరలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే.. ఆ తర్వాత స్వల్పంగా తగ్గినప్పటికీ.. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో మళ్లీ ధరలు పెరుగుతున్నాయి.. తాజాగా.. బంగారం ధర పెరగగా.. వెండి ధర స్వల్పంగా తగ్గింది. జులై 18 2025 శుక్రవారం ఉదయం 6 గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.99,340 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.91,060 గా ఉంది. పది గ్రాముల బంగారంపై రూ.10 మేర ధర పెరిగింది. వెండి ధర రూ.100 తగ్గి రూ.1,13,900 లుగా ఉంది. అయితే, ప్రాంతాల వారిగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,340 ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.91,060 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,23,900 గా ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.99,340, 22 క్యారెట్ల ధర రూ.91,060లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,23,900 లుగా ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,490, 22 క్యారెట్ల ధర రూ.91,140 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,13,900 లుగా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,340, 22 క్యారెట్ల ధర రూ.91,060 ఉంది. వెండి ధర కిలో రూ.1,13,900 గా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.99,340 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.91,060 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,23,900 లుగా ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.99,340, 22 క్యారెట్ల ధర రూ.91,060 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,13,900 లుగా ఉంది.

# వాకింగ్ అవసరం లేకుండా ఈ 4 పనులు చేస్తే బరువు తగ్గుతారు..

మనగళం, : ఆరోగ్యానికి వ్యాయమం తప్పనిసరి. నేటి కాలంలో ప్రతి ఒక్కరూ బిజీగా ఉండడంతో ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తున్నారు. దీంతో అనేక కొత్త రోగాలు వస్తున్నాయి. వివిధ రకాల ఆహార పదార్థాలు తినడం వల్ల బరువు పెరుగుతున్నారు. బరువు తగ్గించుకునేందుకు రోజూవారీ జీవితంలో శారీరక శ్రమ తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. సాఫ్ట్ జాబ్స్ చేసేవాళ్లు బరువు తగ్గాలంటే రోజులో కనీసం కొన్ని నిమిషాలైనా వాకింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉండగలుగుతారని అంటున్నారు. అయితే చాలా మందికి సమయం లేకపోండంతో వాకింగ్ చేయడం కుదరడం లేదు. వాకింగ్ చేయాలని ఉన్నా ఒక్కోసారి శరీరం సహకరించదు. ఈ నేపథ్యంలో వాకింగ్ కు ప్రత్యామ్నాయంగా ఇలా చేస్తే బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

స్కిప్పింగ్: చిన్నప్పుడు స్కూళ్లలో చదువుకునేటప్పుడు స్కిప్పింగ్ ను గేమ్ లో భాగంగా చేర్చేవారు. కానీ ఇప్పుడు ఇది ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు స్కిప్పింగ్ చేయడం వల్ల శరీరంలోని బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఇది సింగిల్ గా కాకుండా సన్నిహితులతో కలిసి గేమ్ లగా ఏర్పాటు చేసుకొని స్కిప్పించ్ చేయడం వల్ల మరింత ఉత్సాహంగా ఉంటారంటున్నారు. స్కిప్పింగ్ చేయడం వల్ల కండరాల గట్టిపడుతాయి. చెమటకు బయటకు తీస్తుంది. దీంతో ఆరోగ్యంగా ఉండగలుగుతారు.

ట్రెక్కింగ్: కొందరు ఖాళీ సమయం దొరికితే సినిమాలు, షికార్లకు వెళ్తుంటారు. ఈ సమయాన్ని ట్రెక్కింగ్ కు ఉపయోగిస్తే మనసు ఉల్లాసంగా ఉండడంతో పాటు ఆరోగ్యంగా ఉండగలుగుతారని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ట్రెక్కింగ్ చేయడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ట్రెక్కింగే చేసే ప్రదేశాలు తక్కువే ఉంటాయి. అయితే తీరిక దొరకినప్పుడల్లా ట్రెక్కింగ్ ను ఎంచుకోవడం ఉత్తమం అనిఅంటున్నారు.

మెట్లు ఎక్కడం: నేటి కాలంలో పెద్ద పెద్ద భవనాలు నిర్మీతమవుతున్నాయి. దీంతో వాటిల్లో లిఫ్ట్ లు తప్పనిసరిగా ఉంటున్నాయి. చాల వరకు పై ఫ్లోర్ కు అర్జంట్ గా వెళ్లాలంటే లిఫ్ట్ ను వాడడంలో తప్పు లేదు. కానీ సమయం ఉన్నప్పుడు లిఫ్ట్ ను అవైడ్ చేసి మెట్ల మీద నుంచి వెళ్లేందుకు ప్రయత్నించాలి. ఇలా ప్రతి రోజూ కనీసం రెండు సార్లు అయినా మెట్ల ఎక్కడం వల్ల కాళ్ల కండరాలు గట్టిపడుతాయి. ఎక్కువ శాతం మెట్లు ఎక్కడం వల్ల బరువును అదుపులో ఉంచుతుంది.

డ్యాన్స్: కొందరు చిన్నప్పుడు బాగా డ్యాన్స్ చేస్తారు. కానీ పెద్దయ్యాక సిగ్గుపడుతారు. కానీ ఇష్టమైన మ్యూజిక్ తో ప్రతిరోజూ డ్యాన్స్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని కొందరు వైద్య నిపుణులు చెబుతున్నారు. డ్యాన్స్ చేయడం వల్ల డిప్రెషన్ నుంచి బయటపడుతారు. ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది. అయితే ఇంట్లో ఎవరూ లేనప్పుడు బిగ్గరగా సౌండ్ వేసుకోవడం ద్వారా ఎక్కువ సేపు డ్యాన్స్ చేయగలుగుతారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# అక్టోబర్ నెలలో విశ్వంభర ?



మనగళం, : ఎదురు చూసి చూసి అలసిపోయిన మెగా ఫ్యాన్స్ కి ఊరట కలిగిస్తూ విశ్వంభర విడుదలకు రంగం సిద్ధమవుతోంది. అధికారికంగా ప్రకటన రాలేదు కానీ చాలా నెలలుగా మీడియా కెమెరాకు దూరంగా ఉన్న దర్శకుడు వశిష్ట ఎట్టకేలకు బయటికి వచ్చాడు. ఇంటర్వ్యూల రూపంలో తన మనసులో మాటలు బయటపెడుతున్నాడు. ఇంకొక్క స్పెషల్ సాంగ్ మాత్రమే బ్యాలన్స్ ఉన్న నేపథ్యంలో దాన్ని జూలై 25 నుంచి మొదలుపెట్టి గుమ్మడికాయ కొట్టేందుకు రెడీ అవుతున్నాడు. అక్టోబర్ లో రిలీజవుతుందనే సంకేతం ఇచ్చాడు. పక్కాగా కాదు కానీ ఫైనల్ అవుట్ పుట్ సంతృప్తికరంగా వస్తే అప్పుడు లాక్ చేస్తామని అన్నాడు. సిజి వర్క్స్ వల్లే విశ్వంభర ఆలస్యమయ్యిందని ఒప్పుకున్న వశిష్ట బెస్ట్ క్వాలిటీ కోసం ఇంత కష్టపడ్డామని చెప్పుకొచ్చాడు. ఈ సంగతి కాసేపు పక్కనపెడితే సెప్టెంబర్ లో విశ్వంభర రావొచ్చని జరిగిన ప్రచారానికి దీంతో చెక్ పడినట్టే. ఓజి, అఖండలో ఏదో ఒకటి తప్పుకుంటే ఆ స్థానంలో మెగా మూవీ వస్తుందనే గాసిప్ గట్టిగానే తిరిగింది. అయితే అప్పటికంతా వర్క్స్ పూర్తయ్యేలా లేకపోవడంతో అక్టోబర్ బెస్ట్ ఆప్షన్ గా భావిస్తున్నారు కాబోలు. ఆ నెలలో ఇప్పటిదాకా అఫీషియల్ గా లాక్ చేసుకుంది సిద్ధూ జొన్నలగడ్డ తెలుసు కదా ఒకటే. రామ్ ఆంధ్రా కింగ్ తాలూకా కూడా ఆ ఆప్షన్ వైపు చూస్తోంది. కాంతార ఫస్ట్ వీక్ లోనే వచ్చేస్తుంది. ఇప్పటికి క్లారిటీ దొరికినా విశ్వంభర ఖచ్చితంగా అక్టోబర్ లోనే వస్తుందన్న గ్యారెంటీ లేదు. ఎందుకంటే ఫైనల్ కట్ అయ్యాక చిరంజీవితో పాటు టీమ్ మొత్తం సంతృప్తి చెందాలి. పైగా వసిష్ఠ చెప్పిన ప్రకారం కొత్త కొత్త లోకాలు, అల్లావుద్దీన్ తరహా పాత్రలు, విచిత్ర ప్రాణుల విన్యాసాలు ఇలా బోలెడు సరంజామా ఉంది.

# కూలీ వదలబోతున్న బ్రహ్మాస్త్రం



మనగళం, : అభిమానులే కాక సగటు ప్రేక్షకుల్లోనూ విపరీతమైన ఎగ్జైట్ మెంట్ కలిగిస్తున్న కూలి ప్రమోషన్ల పరంగా ఏ అవకాశాన్ని వదిలి పెట్టడం లేదు. ముఖ్యంగా తెలుగు మార్కెట్ మీద ప్రత్యేక దృష్టి పెట్టి వార్ 2కి మరింత టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు ఏం చేయాలో అంతా చేస్తోంది. అందులో భాగంగానే జూలై 22 హైదరాబాద్ లో సాంగ్ లాంచ్ ఈవెంట్ ఫిక్స్ చేసుకుంది. భాగ్యనగరంలో మొదటిసారి అనిరుధ్ రవిచందర్ లైవ్ కన్సర్ట్ చేయబోతున్నాడు. ముందస్తు అంచనాల ప్రకారం దీనికి పెద్ద ఎత్తున ఫ్యాన్స్ తరలి రాబోతున్నారు. వేడుక జరగబోతున్న క్వేక్ అరేనా సామర్థ్యం కన్నా రెట్టింపు రావొచ్చని నిర్వాహకులు లెక్క వేస్తున్నారు. ఇది బ్రహ్మాస్త్రం ఎందుకవుతుందంటే పబ్లిసిటీలో ఇప్పుడీ ఈవెంట్ చాలా కీలకం కానుంది. అనిరుద్ ప్రత్యక్షంగా ఇచ్చే వైబ్ మామూలుగా ఉండదు. సాధారణంగా డబ్బింగ్ వెర్షన్లకు లైవ్ చేసేందుకు అతను ఒప్పుకోడు. కానీ రజనీకాంత్ సినిమా కావడం, యాభై కోట్ల డీలింగ్ తో తెలుగులో భారీ బిజినెస్ జరగడం లాంటి కారణాలు తనను మనసు మార్చుకునేందుకు ప్రేరేపించాయి. గతంలో దేవర కోసం నిర్మాత కళ్యాణ్ రామ్ చాలా ట్రై చేశాడు కానీ అనిరుద్ రాలేకపోయాడు. ఆ ఈవెంట్ వేరే రీజన్స్ వల్ల క్యాన్సిల్ కావడం ఇంకో కథ. అంతకు ముందు జెర్సీ, గ్యాంగ్ లీడర్, అజ్ఞాతవాసి వేటికీ కన్సర్ట్ చేయలేదు. అందుకే కూలి స్పెషల్ కానుంది. ఒక్కో పాట ఒక్కో రూపంలో అంచనాలు అంతకంతా పెంచుకుంటూ పోతున్న నేపథ్యంలో సాంగ్స్ ఊహించినట్టే చార్ట్ బస్టర్ కావడం ఫ్యాన్స్ ని ఆనందంలో ముంచెత్తుతోంది. ఇంకోవైపు కూలి మార్కెటింగ్ స్ట్రాటజీ వల్ల వార్ 2 ఇబ్బంది పడుతోంది.


# చిన్న సినిమాలకు మద్దతు అవసరమే కానీ



మనగళం, : ప్రాక్టికల్ గా చూసుకుంటే ప్రేక్షకులు ఎప్పుడూ చిన్నా పెద్దా అనే తారతమ్యం సినిమాల విషయంలో చూపించరు. కంటెంట్ నచ్చిందా టికెట్లు కొంటారు. నచ్చలేదా సాయంత్రానికే జెండా పీకేస్తారు. హీరో సత్యదేవ్ ఇవాళ జరిగిన పరదా రిలీజ్ డేట్ ఈవెంట్ లో మాట్లాడుతూ పెద్ద సినిమాలు రెండు మూడేళ్ళకు వస్తాయని, కానీ చిన్న చిత్రాలు ఇండస్ట్రీని నడిపిస్తాయని స్టేట్ మెంట్ ఇచ్చాడు. ఇది నిజమే. వారానికో మూడు నాలుగు రిలీజులు ఉండాలంటే స్టార్ హీరోల వల్ల కాదు. ఛోటా ప్రొడ్యూసర్లు, కొత్త దర్శకులు నడుం బిగించి తక్కువ ఖర్చుతో మూవీస్ తీస్తేనే సాధ్యమవుతుంది. వినడానికి బాగానే ఉంది కానీ ఇక్కడో కోణం చూడాలి. చిన్న సినిమాలు ఈ మధ్య కాలంలో క్వాలిటీ విషయంలో గాడి తప్పుతున్నాయి. కనీసం యావరేజ్ కూడా అనిపించుకోలేక చేతులు ఎత్తేస్తున్నాయి. మొన్న వచ్చిన ఓ భామ అయ్యో రామా లాంటివి ఈ సంవత్సరంలో చాలానే వచ్చాయి అలాగే కోర్ట్, మ్యాడ్ స్క్వేర్ లాంటి బ్లాక్ బస్టర్లను జనం ఆదరించిన వైనాన్ని మర్చిపోకూడదు. కాకపోతే పెద్ద సినిమాలు తీసుకొచ్చే రెవిన్యూ, వాటికున్న స్పాన్ వేరే లెవెల్. పుష్ప, దేవర, కల్కి, ఆర్ఆర్ఆర్ లాంటివి రికార్డులు బద్దలు కొట్టి వేల కోట్లు వసూలు చేశాయంటే దానికి కారణం విజువల్ గ్రాండియర్ నెస్. కళ్ళు చెదిరే ఖర్చుతో దర్శకులు ఆవిష్కరించిన సరికొత్త ప్రపంచాలు. కాబట్టి లేటవుతాయి. సత్యదేవ్ అన్నట్టు బడ్జెట్ చిత్రాలు వస్తూనే ఉండాలి. ఒకరకంగా థియేటర్ వ్యవస్థ బ్లాక్ అవ్వకుండా కాపాడేది ఇవే. కానీ నాణ్యత లేనప్పుడు ఎంత డబ్బులు పెట్టినా రిలీజ్ రోజు ఉదయానికే షోలు క్యాన్సిల్ చేసే పరిస్థితి తలెత్తవచ్చు. స్టార్ క్యాస్టింగ్ ఉన్నా లేకపోయినా కంటెంట్ తప్ప ఇంకేదీ జనాన్ని థియేటర్లకు రప్పించలేదు. పైగా అదుపు తప్పుతున్న టికెట్ రేట్లు, స్నాక్స్ ధరలు సామాన్యులను థియేటర్లకు దూరం చేస్తున్నాయి. వీటి మీద కూడా సీరియస్ గా దృష్టి పెట్టాలి. లేదంటే చేదు ఫలితాలు రిపీటవుతూనే ఉంటాయి. పదే పదే ఈ విషయం గురించే మాట్లాడుకోవాల్సి వస్తుంది.

# జనాల దృష్టిలో జూనియర్

మనగళం, : విడుదల కాబోతున్న సినిమాల్లో జూనియర్ మీద పబ్లిక్ లో పెద్దగా బజ్ లేదు. నిర్మాణం జరుపుకుని నెలలు గడిచినప్పటికీ ఫైనల్ గా థియేటర్లలో అడుగు పెట్టబోతోంది. ప్రముఖ మైనింగ్ వ్యాపారవేత్త, ప్రజా ప్రతినిధి గాలి జనార్దన్ రెడ్డి కొడుకు కిరిటీ హీరోగా పరిచయమవుతున్న ఈ మూవీకి ప్రధాన ఆకర్షణలు చాలా ఉన్నాయి. హీరోయిన్ శ్రీలీల వైరల్ వయ్యారి డాన్స్ ఆల్రెడీ వైరలయ్యింది. దేవిశ్రీ ప్రసాద్ మార్క్ పాట ఒకటి క్లిక్ అయితే ఆటోమేటిక్ గా ఆ చిత్రం మీద బజ్ రావడం గతంలో చాలాసార్లు చూశాం. అయితే నిన్న జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ వల్ల జనాల దృష్టిలో జూనియర్ పడ్డట్టు అయ్యింది. రాజమౌళి అతిథిగా రావడం, చాలా గ్యాప్ తర్వాత బొమ్మరిల్లు జెనీలియా రీ ఎంట్రీ ఇచ్చి వేడుకకు హాజరు కావడం, శ్రీలీల గ్లామర్ ప్లస్ స్పీచ్, దేవి హుషారైన ప్రసంగం, ఇతర సాంకేతిక నిపుణుల ఎలివేషన్లు మొత్తంగా ఈ వీడియోలన్నీ సోషల్ మీడియాలో బాగానే తిరుగుతున్నాయి. బాగా డౌన్ టు ఎర్త్ లా కనిపిస్తున్న కిరిటీ ఆశలన్నీ తన మాతృబాష కన్నడ కంటే తెలుగు మార్కెట్ మీదే ఎక్కువగా ఉన్నాయి. క్లిక్ అయితే ఇక్కడ ఏ స్థాయిలో ఆఫర్లు వస్తాయో అవగాహన ఉన్నట్టుంది. పైగా దేవీశ్రీప్రసాద్ ఏకంగా అల్లు అర్జున్ ఆర్యతో జూనియర్ ని పోల్చడం చూస్తుంటే కంటెంట్ ఏదో సాలిడ్ గానే ఉందని చెప్పాలి. రేపు టాక్ కొంచెం డీసెంట్ గా వచ్చినా వీకెండ్ లో మంచి నెంబర్లు చూడొచ్చు. లేదూ హిట్ టాక్ వస్తే బ్రేక్ ఈవెన్ టార్గెట్ చేసుకోవచ్చు. ఎటొచ్చి వచ్చే వారం హరిహర వీరమల్లు ఉన్న నేపథ్యంలో ఏం చేసినా ఏడు రోజుల్లో జరిగిపోవాలి. కొంత కాలంగా నిర్మాణానికి దూరంగా ఉన్న వారాహి చలన చిత్రం సాయి కొర్రపాటి నిర్మించడం వల్లే రాజమౌళి ఈ ఈవెంట్ కి వచ్చారనేది ఓపెన్ సీక్రెట్. ఇప్పుడు అందరి చూపు రేపు రాబోయే రిపోర్ట్స్ మీదే ఉన్నాయి. పెద్దగా పోటీ లేకపోవడంతో జూనియర్ కు బాక్సాఫీస్ వద్ద మంచి ఛాన్స్ దొరికింది. దాన్ని సరిగ్గా వాడుకుంటే మాత్రం కిరీటి టాలీవుడ్ తొలి అడుగు విజయవంతంగా పడుతుంది.



# 'హరిహర..' అద్భుతంగా ఉంటుంది





మనగళం, : ధర్మం కోసం పోరాడే యోధుడి పాత్రలో పవన్ కళ్యాణ్ నటించిన చిత్రం 'హరి హర వీరమల్లు'. నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిం చిన ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం.జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. నిధి అగర్వాల్, బాబీ డియోల్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈనెల 24న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కథానాయిక నిధి అగర్వాల్ మీడియాతో మాట్లాడుతూ, 'దర్శకుడు క్రిష్ నా పాత్ర గురించి, కథ గురించి చెప్పినప్పుడే ఈ సినిమా చేయాలని డిసైడ్ అయ్యాను. అయితే అదృష్టం కొద్దీ పవర్‌స్టార్‌తో ఇంత గొప్ప సినిమాలో నటించే అవకాశం రావడమే కాకుండా.. పంచమి అనే శక్తివంతమైన పాత్ర కూడా లభించింది. ఈ పాత్రలో ఎన్నో కోణాలున్నాయి. పవన్ కళ్యాణ్‌కి, నాకు మధ్య వచ్చే సన్నివేశాలు బాగుంటాయి. వేరే వంద సినిమాలు చేసినా ఒకటే.. పవన్‌తో ఒక్క సినిమా చేసినా ఒకటే. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో ఓ కల్పిత పాత్రను తీసుకొని ఈ కథ రాశారు. రాబిన్ హుడ్ తరహా పాత్రలో పవన్ కనిపిస్తారు. ఓ రకంగా ఇండియానా జోన్స్ సినిమాకి ఇండియన్ వెర్షన్ ఇది. దర్శకుడు జ్యోతి కృష్ణ సాంకేతికంగా గొప్పగా ఆలోచిస్తారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నిర్మాత ఎ.ఎం.రత్నం చిత్రాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సినిమా చాలా అద్భుతంగా ఉంటుంది' అని తెలిపారు.

# పక్కా పైసా వసూల్ సినిమా

మనగళం, : రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా తెరంగేట్రం చేస్తూ నటించిన చిత్రం 'జూనియర్'. రాధా కృష్ణ దర్శకుడు శ్రీశీలీల హీరోయిన్‌గా, జెనీలియా కీలక పాత్ర పోషించారు. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మించారు. ఈ సినిమా నేడు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ,'నిర్మాత సాయి ఈ సినిమా మొదలుపెట్టినప్పుడు మంచి కథతో ఒక చిన్న సినిమా చేస్తున్నారని అనుకున్నాను. కానీ చాలా పెద్ద సినిమా చేశారు. దేవి ఎప్పుడు కూడా తన మ్యూజిక్‌తో సినిమాని ఎలివేట్ చేస్తాడు. 'వైరల్ వయ్యారి' ఎంత వైరల్ అయిందో మళ్లీ దాని గురించి స్పెషల్‌గా చెప్పక్కర్లేదు. ఈ సినిమాని ఫస్ట్ డే చూడాలనే ఇంట్రెస్ట్‌ని క్రియేట్ చేయించిన సాంగ్ అది. పీటర్, సెంథిల్ ఇద్దరు కలిసి ఒక అబ్బాయి బాగా చేస్తున్నాడని చెబుతున్నారంటే కిరీటీకి అంతకంటే పెద్ద సర్టిఫికెట్ ఫిల్మ్ ఇండిస్టీలో ఉండదు. ఈ సినిమా కిరీటీని తప్పకుండా పెద్ద స్థాయికి వెళుతుంది. శ్రీలీల అద్భుతమైన డాన్సర్. దర్శకుడు రాధాకృష్ణ మూడు సంవత్సరాల నుంచి ఈ ప్రాజెక్టు కోసం కష్టపడ్డారు. ఇది పక్కా పైసా వసూల్ సినిమా' అని అన్నారు.



మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక

క్రీడా

శనివారం
19 - 07 - 2025



## గిల్‌కి ఎసరుపెట్టిన హార్దిక్ ఫ్రెండ్.. 600 పరుగులు కొట్టినా...

మనగళం, : ఇంగ్లాండ్ మాజీ ప్లేయర్ ఓవైస్ షా.. కెఎల్ రాహుల్ గురించి కీలక ప్రకటన చేశాడు. రాబోయే మ్యాచ్‌లలో పరుగుల పరంగా కెఎల్ రాహుల్.. శుభ్‌మన్ గిల్‌ను మించిపోతాడని సంచలన కామెంట్స్ చేశాడు. ఇంగ్లాండ్‌తో 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతోంది టీమిండియా. ఈ సిరీస్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కెఎల్ రాహుల్ రాణించగా.. టీమిండియా బ్యాటింగ్‌కు వీరే పిల్లర్స్. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ ఓవైస్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే మ్యాచ్‌లలో రాహుల్ పరుగుల వరద పారిస్తాడని.. గిల్‌ను దాటేస్తాడని జోస్యం చెప్పాడు. 'రాహుల్ ఇప్పటికీ కోహ్లీ నీడలోనే ఉన్నాడు. రాహుల్, కోహ్లీ బ్యాటింగ్ చేసేటప్పుడు.. అందరికీ కోహ్లీనే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్. అప్పుడూ రాహుల్‌ను విస్మరించారు. ఇప్పుడూ అదే తీరు. ఓ పాడ్‌కాస్ట్‌లో ఓవైస్ షా మాట్లాడుతూ.. అటు ఫ్యాన్స్.. ఇటు టీమిండియా.. ఇప్పటిదాకా రాహుల్‌ను విస్మరించారు. అయితే కోహ్లీ రిటైర్మెంట్‌తో రాహుల్‌కు ఇప్పుడు పేరు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. విరాట్ కోహ్లీ లేకుండా ఇది మొదటి సిరీస్. అవును! శుభ్‌మన్ గిల్ చాలా బాగా రాణించాడు. అయితే అతడు ఎక్కువకాలం ఈ ఫామ్ కొనసాగించలేడు. భారత బ్యాటింగ్ లైనప్‌లో రాహుల్ అత్యుత్తమ బ్యాట్స్‌మెన్. అతని టెక్నిక్ కూడా అద్భుతమైనది. 10 నుంచి 15 మ్యాచ్‌ల తర్వాత కెఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్‌ను అధిగమిస్తాడని భావిస్తున్నాను. రాబోయే 12 నెలల్లో మనం దీనిని ఆశించవచ్చునని అన్నారు. శుభ్‌మన్ గిల్ గురించి చెప్పాలంటే.. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో అతను మూడు మ్యాచ్‌ల్లో 101.17 సగటుతో 607 పరుగులు చేశాడు. టెస్ట్ సిరీస్‌లో గిల్ రెండు సెంచరీలు, ఒక డబుల్ సెంచరీ సాధించాడు. కెఎల్ రాహుల్ మూడు మ్యాచ్‌ల్లో 62.50 సగటుతో 375 పరుగులు చేశాడు. ఇంగ్లాండ్‌తో ఇంకా రెండు టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ ఇద్దరు ఆటగాళ్లు మరిన్ని పెద్ద స్కోర్లు చేయవచ్చునని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.



## దీప్తి మెరువగా..! తొలి వన్డేలో భారత్ విజయం



మనగళం, : ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (62 నాటౌట్, 64 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీతో రాణించగా ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో భారత మహిళలు 4 వికెట్ల తేడాతో గెలుపొందారు. 259 పరుగుల ఛేదనలో ఓపెనర్లు ప్రతిక రావల్ (36, 51 బంతుల్లో 3 ఫోర్లు), స్మృతీ మంధాన (28, 24 బంతుల్లో 5 ఫోర్లు) సహా హర్లీన్ డియోల్ (27, 44 బంతుల్లో 4 ఫోర్లు) రాణించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (17) నిష్క్రమణతో 124/4తో భారత్ ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో జెమీమా రొడ్రిగస్ (48, 54 బంతుల్లో 5 ఫోర్లు)తో కలిసి దీప్తి శర్మ (62 నాటౌట్) అద్భుత భాగస్వామ్యం నిర్మించింది. రిచా ఘోష్ (10) నిరాశపరిచినా.. అమన్జోత్ కౌర్ (20 నాటౌట్, 14 బంతుల్లో 3 ఫోర్లు) తోడుగా దీప్తి శర్మ లాంఛనం ముగించింది. 48.2 ఓవర్లలో 6 వికెట్లకు భారత్ 262 పరుగులు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ మహిళలు 50 ఓవర్లలో 6 వికెట్లకు 258 పరుగులు చేశారు. సోఫి (83, 92 బంతుల్లో), అలైస్ (53, 73 బంతుల్లో 2 ఫోర్లు), నటాలీ (41, 52 బంతుల్లో 5 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్ (2/55), స్నే%ఎ% రానా (2/31) మెరిశారు. ఛేదనలో మెరిసిన దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది. భారత్, ఇంగ్లాండ్ మహిళల రెండో వన్డే శనివారం లార్డ్స్‌లో జరగనుంది.



## ఇంగ్లాండ్‌తో కీలక పోరు.. టీమిండియాకు గుడ్ న్యూస్..



మనగళం, :భారత్ - ఇంగ్లాండ్ నాలుగో టెస్టుకు ఇంకా వారం రోజుల సమయం ఉంది. మూడో టెస్టులో ఓటమితో కసి మీదున్న టీమిండియా నాలుగో టెస్టులో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఉంది. దీనికి సంబంధించి ఇప్పటినుంచే వ్యూహాలు రచిస్తుంది. అయితే ఈ మ్యాచ్‌లో బుమ్రా ఆడటంపై సస్పెన్స్ నెలకొంది. దీనికి సంబంధించి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. భారత్ - ఇంగ్లాండ్ నాల్గవ టెస్ట్ ఈ నెల 23నుంచి ప్రారంభం కానుంది. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. మూడో టెస్టులో ఓడిపోయిన టీమిండియా ఈ మ్యాచ్‌లో గెలవాలనే పట్టుదలతో ఉంది. ఇప్పటివరకు రెండు జట్ల మధ్య మూడు టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. ఇంగ్లాండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. అందువల్ల, సిరీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే మాంచెస్టర్ టెస్ట్ గెలవడం భారత్‌కు చాలా ముఖ్యం. దీంతో భారత్ గెలుపు వ్యూహాలను రచిస్తోంది. ఈ కీలకమైన మ్యాచ్‌కు స్టార్ బౌలర్ బుమ్రా అందుబాటులో ఉంటాడా..? లేదా అనే సందేహాలు నెలకొన్నాయి. దీనికి సంబంధించి ఓ కీలక అప్ డేట్ వచ్చింది. జస్ప్రీత్ బుమ్రా మాంచెస్టర్ టెస్ట్‌లో ఆడతారని తెలుస్తోంది. ఈ సిరీస్‌కు బుమ్రాను ఎంపిక చేసేటప్పుడే.. అతడు మూడు టెస్టులకు మాత్రమే అందుబాటులో ఉంటాడని బీసీసీఐ తెలిపింది. భవిష్యత్తు మ్యాచులను దృష్టిలో ఉంచుకుని అతడికి రెస్ట్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఫస్ట్ మ్యాచ్ ఆడిన బుమ్రా రెండో మ్యాచుకు రెస్ట్ తీసుకున్నాడు. మళ్లీ మూడో మ్యాచ్ ఆడిన బుమ్రా.. నాలుగో మ్యాచుకు రెస్ట్ తీసుకోవాలి. కానీ ఈ మ్యాచ్ కీలకం కావడంతో అతడు ఆడతారని సమాచారం. ఈ టెస్టుకు ఇంకా వారం రోజుల టైమ్ ఉండడంతో బుమ్రాను రంగంలోకి దించాలని బీసీసీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ టెస్ట్ మ్యాచ్‌కు బుమ్రా అందుబాటులో ఉండటం బౌలింగ్ విభాగం మరింత బలంగా మారుతుంది. ఈ సిరీస్‌లో టీమిండియా తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో బుమ్రా రెండవ స్థానంలో ఉన్నాడు. అతను రెండు టెస్టులలో 12 వికెట్లు పడగొట్టాడు. మొదటి స్థానంలో ఉన్న సిరాజ్ మూడు టెస్ట్ మ్యాచ్‌లలో 13 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్‌లో ఇప్పటివరకు 11 మ్యాచ్‌ల్లో జస్ప్రీత్ బుమ్రా 24.97 సగటుతో 49 వికెట్లు పడగొట్టాడు. ఇందులో, అతను నాలుగు సార్లు ఐదు వికెట్లు కూడా పడగొట్టాడు. ఇప్పుడు మాంచెస్టర్ టెస్ట్‌లో భారత్ గెలవడంతో బుమ్రా కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది.

## ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్‌ను మోసం చేసిన పాక్ ప్రభుత్వం

మనగళం, : పాకిస్తాన్ ఒలింపిక్ జావెలిన్ త్రో స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్, తన విజయం తర్వాత పాకిస్తాన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో జావెలిన్ విసిరి నీరజ్ చోప్రాను ఓడించి స్వర్ణం సాధించిన నదీమ్‌కు నగదు బహుమతులు అందినప్పటికీ, ప్రకటించిన భూ ప్లాట్ల హామీలు మాత్రం ఉత్తుత్తివేనని ఆయన స్పష్టం చేశారు. పారిస్ ఒలింపిక్స్ 2024లో పాకిస్తాన్‌కు స్వర్ణ పతకాన్ని అందించిన ఒలింపిక్ హీరో అర్షద్ నదీమ్, తమ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వర్ణం గెలిచిన తర్వాత ప్రభుత్వం ఇచ్చిన ముఖ్యమైన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని నదీమ్ బహిరంగంగానే విమర్శించారు. ఆయన విజయం దేశవ్యాప్తంగా సంబరాలు నింపినప్పటికీ, ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. గత ఆగస్టులో స్టేడ్ డి ఫ్రాన్స్‌లో 92.97 మీటర్ల రికార్డు దూరం జావెలిన్ విసిరి, పాకిస్తాన్‌కు ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో మొట్టమొదటి ఒలింపిక్ స్వర్ణాన్ని అందించిన అర్షద్ నదీమ్, ఈ పోటీలో భారత్ స్టార్ నీరజ్ చోప్రా (రజతం)ను ఓడించి చరిత్ర సృష్టించాడు. అతని విజయం తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు భారీ నగదు బహుమతులు, భూ ప్లాట్‌లతో సహా అనేక రివార్డులను ప్రకటించాయి. అయితే, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అర్షద్ నదీమ్ మాట్లాడుతూ.. తనకు ప్రకటించిన అన్ని నగదు బహుమతులు అందినప్పటికీ, ప్రభుత్వం ఇస్తామన్న ప్లాట్ల హామీలు మాత్రం ఒట్టి మాటలుగానే మిగిలిపోయాయని వెల్లడించాడు. "నాకు ప్రకటించిన బహుమతులలో అన్ని ప్లాట్ హామీలు అబద్ధమే, అవి నాకు అందలేదు. అవి కాకుండా ప్రకటించిన అన్ని నగదు బహుమతులు నాకు వచ్చాయి" అని ఆయన తెలిపారు. ఒక సామాన్య కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన నదీమ్ నిరాశను ఎంతోమంది అర్థం చేసుకున్నారు. పంజాబ్‌లోని మియాన్ చన్ను అనే చిన్న పట్టణంలో పుట్టి పెరిగిన నదీమ్ సాధారణ కుటుంబానికి చెందినవాడు. అతని తండ్రి ఒక నిర్మాణ కార్మికుడు, ఇప్పటికీ కుటుంబానికి ప్రధాన సంపాదనదారు. కష్టపడి ప్రాక్టీస్ చేసి, దేశానికి బంగారు పతకం సాధించిన క్రీడాకారుడికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అర్షద్ నదీమ్ రాబోయే టోర్నమెంట్‌లపై దృష్టి సారించాడు. ఈ సెప్టెంబర్‌లో టోక్యోలో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ కోసం ఆయన ప్రస్తుతం ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. "నా దృష్టి అంతా నా మీదనే ఉంది, అది కాకుండా, మా వద్ద ట్రైనింగ్ కోసం వచ్చే ఏ యువకుడికైనా మేము ట్రైనింగ్ ఇస్తాము, ఈ ట్రైనింగ్ నా కోచ్ సల్మాన్ బట్ ఇస్తాడు" అని ఆయన చెప్పుకొచ్చాడు. టోక్యో ఛాంపియన్‌షిప్‌కు ముందు ఆగస్టు 16న పోలాండ్‌లోని సిలేసియాలో జరిగే డైమండ్ లీగ్ మీట్‌లో అర్షద్ నదీమ్- నీరజ్ చోప్రా పోటీకి మరో అధ్యాయం తెర లేవనుంది. ఈ ఇద్దరు దిగ్గజ జావెలిన్ త్రోయర్‌ల మధ్య పోరును చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## ఇప్పటికైనా తీరు మారాలి లేకుంటే మనుగడ ప్రశ్నార్థకమే!

మనగళం, : ఒకప్పుడూ ప్రపంచ క్రికెట్‌లో ఎదురులేని శక్తిగా కొనసాగిన వెస్టిండీస్ జట్టు కొన్నేళ్లుగా వరుస ఓటములతో పతనావస్థకు చేరుకుంది. టి20 ఫార్మాట్‌లో తప్పిస్తే వన్డేలు, టెస్టులలో విండీస్ ఆట రోజురోజుకు తీసికట్టుగా తయారవుతోంది. 70, 80 దశకాల్లో ప్రపంచ క్రికెట్‌ను శాసించిన విండీస్ 90 దశకానికి వచ్చే సరికి బలహీనంగా మారింది. అయితే బ్రియాన్ లారా, చందర్‌పాల్, క్రిస్ గేల్, శర్వాణ్ వంటి ఆటగాళ్ల వల్ల కాస్త పర్వాలేదనిపించింది. కానీ రెండు దశాబ్దాలుగా విండీస్ ఆట తీరు చాలా ఘోరంగా తయారైంది. తొలి వన్డే వరల్డ్‌కప్‌లు గెలిచి మూడోసారి కూడా ఫైనల్‌కు చేరిన విండీస్ ఇటీవల కాలంలో మెగా టోర్నమెంట్‌కు అర్హత కూడా సాధించలేక పోయిందంటే దాని ఆటతీరు ఎంతగా పడిపోయిందో ఊహించుకోవచ్చు. తాజాగా ఆస్ట్రేలియాతో జమైకా వేదికగా జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 27 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయాన్ని చవిచూసింది. 204 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన విండీస్ ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి ఎదురు నిలువలేక తక్కువ స్కోరుకే కుప్పకూలింది. ఇది ప్రపంచ టెస్టు క్రికెట్‌లోనే రెండో అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. వివ్ రిచర్డ్స్, క్లైవ్ లాయిడ్, గ్యారీ సోబర్స్, డెస్మండ్ హేన్స్, గార్డెన్ గ్రినిడ్జ్, కోట్నీ వాల్ష్, మాల్కమ్ మార్షల్, అంబ్రోస్, బ్రియాన్ లారా, చందర్‌పాల్, కార్ల్ హూపర్, బెంజిమన్ వంటి ఆటగాళ్లతో కూడిన విండీస్ చాలా ఏళ్ల పాటు ప్రపంచ క్రికెట్‌ను శాసించింది. అయితే ఈ ఆటగాళ్లు ఒక్కొక్కరూ జట్టుకు దూరం కావడంతో విండీస్ క్రికెట్ పతనం కావడం ప్రారంభమైంది. విండీస్ ఆట ఎంత దుస్థికి చేరిందంటే అది వరల్డ్‌కప్ వంటి టోర్నమెంట్‌కు అర్హత కూడా సాధించలేక పోతోంది. అఫ్గానిస్థాన్, నెదర్లాండ్స్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్, ఐర్లాండ్, ఒమన్ వంటి చిన్న దేశాలు సయితం మెగా టోర్నీకి అలవోకగా అర్హత సాధిస్తుండగా విండీస్ మాత్రం వరల్డ్‌కప్‌కు నేరుగా అర్హత సాధించలేక పోతోంది.



Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310